
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
బుధవారం 18 డిసెంబరు 2024



స్నాతకోత్సాహం



మంగళగిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కేరింతలు.. వారి కుటుంబసభ్యులు, తల్లిదండ్రుల ఆనందోత్సాహాలు.. అతిరథులకు స్వాగత సత్కారాల మధ్య మంగళవారం మంగళగిరి ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సాధారణంగా స్నాతకోత్సవాలకు గవర్నర్ చాన్సలర్ హోదాలో పాల్గొంటారు. అయితే ఏకంగా రాష్ట్రపతి హాజరుకావడంతో ఈ వేడుకకు విశేషమైన ప్రాధాన్యం ఏర్పడింది. ఎయిమ్స్ స్నాతకోత్సవానికి చాన్సలర్ హోదాలో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖమంత్రి జేపీ నడ్డా హాజరు కావాల్సి ఉండగా ఆ స్థానంలో ఆ బాధ్యతలను కేంద్ర ఆయుష్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావుజాదవ్ నిర్వర్తించారు. జాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో రాష్ట్రపతి నలుగురు విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. ఓవరాల్ అకడమిక్ టాపర్‌గా కేరళకు చెందిన లియా అజీ, బెస్ట్ మేల్ టాపర్‌గా ఏపీకి చెందిన దాసరి దివ్యాంశ్, బెస్ట్ ఫిమేల్ టాపర్‌గా పంజాబ్‌కు చెందిన సుప్రభసింహా, బెస్ట్ ఇంటర్న్‌షిప్‌గా కేరళకు చెందిన వీకే అధీరా ప్రభృతులు బంగారు పతకాలను అందుకున్నారు. 47 మంది ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్లు, మరో నలుగురు పోస్ట్ డాక్టోరల్ సర్టిఫికెట్ కోర్సు విద్యార్థులకు కేంద్రమంత్రి ప్రతాప్‌రావ్‌జాదవ్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌యాదవ్‌తో కలిసి

(మిగతా 8వ పేజీలో)



వేడుకకు హాజరైన వైద్య విద్యార్థులు, కుటుంబసభ్యులు

- సంబరంగా ఎయిమ్స్ స్నాతకోత్సవం
- విద్యార్థులకు పట్టాలు అందజేసిన రాష్ట్రపతి
- మహిళా వైద్యుల శాతంపై ద్రౌపదిముర్ము హర్షం
- వైద్యులు చిత్తశుద్ధితో సేవకు ప్రాధాన్యమివ్వాలన్న రాష్ట్రపతి
- కేంద్ర సహాయమంత్రి, గవర్నర్, ముఖ్యమంత్రి సమక్షంలో వేడుక
- ఎయిమ్స్‌లో ఇకపై మౌలిక సదుపాయాలకు లోటు రానివ్వం: చంద్రబాబు



స్నాతకోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్రతాప్‌రావు జాదవ్, లోకేశ్, సత్యకుమార్ యాదవ్



రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న సీఎస్ నీరబ్‌కుమార్, డీజీపీ ద్వారకా తిరుమలరావు, కలెక్టర్ నాగలక్ష్మి

8



అభిషేకాల అనంతరం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామికి విశేష అలంకారం

త్రికోటేశ్వరునికి మహారుద్రాభిషేకం

- జ్యోతి దర్శనంతో పులకించిన భక్తులు



పల్లెకోనలో నిర్మించిన ఆడిటోరియం

8

నటనకు తొలి మెట్టు రంగస్థలం

నాటకాలకు ఊపిరిపోస్తున్న పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్టు

పథకం ప్రకారమే చంపేసింది!

- సహకరించిన ప్రియుడు, నలుగురు మైనర్లు
- అన్నదమ్ముల హత్య కేసులో చెల్లిసహా ఆరుగురి అరెస్టు


3

మాచర్లలో.. మట్కా

ఈజీ మనీ మాయలో యువత

బలైపోతున్న మధ్య తరగతి కుటుంబాలు

ప్రేక్షకపాత్రకే పోలీసులు పరిమితం



మాచర్లటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈజీ మనీ.. వందకు రెండొందలు.. రెండొందలకు ఐదొందలు.. నిమిషాల్లోనే వేలు సంపాదించొచ్చు.. అంటూ కొందరు కేటుగాళ్లు వల విసురుతుండగా ఆ మాయలో యువకులు, మధ్యతరగతివారు చిక్కుకుంటున్నారు. గతంలో నగరాల్లోనే కనబడిన ఈ విష సంస్కృతి నేడు మాచర్లకు కూడా పాకింది. మాచర్లలో గత కొన్ని రోజులుగా మట్కా, క్రికెట్ బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి.కొందరు బ్రోకర్లను ఏర్పాటు చేసుకుని జూదమాడిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరించడంపై విమర్శలు, ఆరోపణలు వస్తున్నాయి. మాచర్లలోని గడియార స్తంభం, మార్కెట్ సెంటర్, బస్టాండ్ సెంటర్, రింగురోడ్డు సెంటర్లలో కొందరు నిర్వాహకులు మట్కా నిర్వహిస్తున్నారు. వీరికి కొందరు పెద్దల అండ ఉన్నట్లు సమాచారం. దీంతో నిత్యం ఈ ఆట ద్వారా రూ.లక్షల్లో దండుకుంటున్నారు. సెల్‌ఫోన్లలో ద్వారా మట్కా నిర్వహిస్తున్నారు. నిర్వాహకులు నిర్దేశించిన సొమ్ము డిపాజిట్ చేయించుకుని సెల్‌ఫోన్ల ద్వారా లాగిన్ ద్వారా పందాలు కాసే వారికి స్లిప్పులు అందజేస్తారు. మట్కా ఆడి డబ్బులు పోగొట్టుకుని ఎందరో ఆర్థికంగా చితికిపోతున్నారు. ఇక క్రికెట్‌సీజన్‌లో బెట్టింగ్‌లు కూడా మాచర్లలో జోరుగా సాగుతున్నాయి. మాచర్లలో నలుగురు బుకీలు ఉన్నారు. ఏదైనా సిరీస్‌కు నాలుగు రోజుల ముందు వీరు బ్రోకర్లను ఏర్పాటు చేసుకుని వారికి పట్టణంలోని లాడ్జీలు, ఇతర ప్రాంతాల్లో ప్రత్యేకంగా వసతి ఏర్పాటు చేసి బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఈ నెల 15న బిగ్ బ్యాష్(ఆస్ట్రేలియా) మ్యాచ్‌లో పంటర్లు ఆఫర్లు ఇవ్వడంతో జోరుగా బెట్టింగ్‌లు సాగాయి. పోలీసుల నిర్లక్ష్యం వల్ల ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయి.

23 బార్లకు నోటిఫికేషన్

ఖాళీగా ఉన్న వాటికి దరఖాస్తుల ఆహ్వానం

ఈ నెల 22 వరకు దరఖాస్తు.. 24న ఈ-వేలం

గుంటూరులో ప్రీమియం లిక్కర్ స్టోర్‌కు రూ.15 లక్షల ఫీజు



గుంటూరు(కార్పొరేషన్), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకొచ్చి వైన్స్‌కు ఇటీవల అనుమతించింది. కాగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎవరూ దరఖాస్తు చేసుకోకపోవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 23 బార్లు ఖాళీగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఆ 23 బార్లకు నోటిఫికేషన్ జారీ చేసింది. వీటితో పాటు గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ప్రీమియం లిక్కర్ స్టోర్‌కు కూడా నోటిఫికేషన్ జారీ చేసింది. బార్లకు ఈ నెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. 23న ఆయా దరఖాస్తుల పరిశీలన 24న ఈ-ఆక్షన్ జరుగుతుందని అధికారులు తెలిపారు. ఒక్కో బార్‌కు ఈ-వేలం రెండు విడతల్లో జరుగుతుందని, ఉదయం వేలానికి ఎవరూ రాకపోతే ఆ బార్‌కు మధ్యాహ్నం నిర్వహిస్తామన్నారు. గుంటూరులో ఏర్పాటు చేసే ప్రీమియం లిక్కర్ స్టోర్‌కు ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

దరఖాస్తు ఫీజులు ఇలా..

మంగళగిరి తాడేపల్లి మున్సిపాలిటీ పరిధిలో-1, తెనాలి-5, పొన్నూరు-2, రేపల్లె-1, పిడుగురాళ్ల-6, మాచర్ల-3, గురజాల-2, దాచేపల్లిలో-3 చొప్పున బార్లకు నోటిఫికేషన్ జారీ చేశారు. మంగళగిరి తాడేపల్లి పరిధిలో ఒక షాపునకు రూ.10 లక్షలు నాన్ రీఫండబుల్ ఫీజు చెల్లించాలి. గురజాల, దాచేపల్లి షాపులకు రూ.5 లక్షలు, తెనాలి, పొన్నూరు, రేపల్లె, పిడుగురాళ్ల, మాచర్లలోని బార్లకు ఫీజు రూ.7.5 లక్షలు చొప్పున ఫీజుగా నిర్ణయించారు. ఐదేళ్ల కాలపరిమితిలో ప్రీమియం లిక్కర్ స్టోర్‌కు రూ.15 లక్షలు ఫీజు నిర్ణయించినట్లు గుంటూరు ఎక్సైజ్ డీసీ డాక్టర్ కె.శ్రీనివాసులు మంగళవారం తెలిపారు.



నాగార్జున సాగర్ ప్రాజెక్టు

- 21న ప్రాజెక్టు కమిటీ ఎన్నిక
- ప్రాజెక్టు కమిటీ చైర్మన్ రేసులో నలుగురు
- నేడు ఎమ్మెల్యేలతో మంత్రి గొట్టిపాటి భేటీ
- పీసీ ఎన్నికకు నేడు నోటిఫికేషన్

డీసీలు ఏకగ్రీవం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు(డీసీ) మంగళవారం ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి. నీటి సంఘాలకు ఎన్నికైన అధ్యక్షులు డీసీ అధ్యక్ష.. ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 21న ప్రాజెక్టు కమిటీకి(పీసీ) ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తోంది. ఈ మేరకు బుధవారం ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్టు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. నరసరావుపేటలో పీసీ ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

టీడీపీలోని సీనియర్ నేతలు పీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. ఈ పదవికి నలుగురు నేతలు రేసులో నిలిచారు. ప్రాజెక్టు కమిటీకి అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎంపిక చేసే బాధ్యతలను పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు కూటమి అధిష్ఠానం అప్పగించింది. ప్రాజెక్టు పరిధిలో మొత్తం 48 డిస్ట్రిబూటరీ కమిటీలు ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 32, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 16 డీసీలు ఉన్నాయి. అధిష్ఠానం సూచన మేరకు బుధవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంత్రి గొట్టిపాటి పీసీ అధ్యక్షుడి ఎన్నిక కోసం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి ఆయన ఆయా జిల్లాల్లో ఎమ్మెల్యేలను ఆహ్వానించారు. పీసీకి పోటీలో ఉన్న నేతలు కూడా సమావేశానికి హాజరు కానున్నట్టు సమాచారం. ఎమ్మెల్యే అభిప్రాయాలను విడివిడిగా మంత్రి సేకరించి పార్టీ అధిష్ఠానానికి తెలియజేయనున్నారు.

ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవికి సత్తెనపల్లి నియోజకవర్గంలోని ముప్పాళ్ల -11 డీసీ నుంచి అధ్యక్షుడిగా ఎన్నికైన గోగినేని కోటేశ్వరరావు, నరసరావుపేట నియోజవర్గంలోని లింగంగుంట్ల- 19 డీసీ అధ్యక్షుడు పులిమి వెంకట రామిరెడ్డి, గురజాల నియోజవర్గానికి చెందిన కారంపూడి డీసీ -3 అధ్యక్షుడు పులుకూరి కాంతారావు, మాచర్ల నియోజవర్గం కేసానుపల్లి డీసీ 4 నుంచి ఎన్నికైన పంగులూరి అంజయ్య పీసీ చైర్మన్ పదవి రేసులో ఉన్నారు. మొదటి నుంచి గోగినేని పీసీ చైర్మన్ పదవిని ఆశిస్తుండగా కొత్తగా పులిమి రామిరెడ్డి, పులుకూరి కాంతారావు, పంగులూరి అంజయ్య రేసులో నిలిచారు. ఎమ్మెల్యేలు ఎవరికి మద్దతు ఇస్తే వారే చైర్మన్‌గా ఎన్నికవుతారు. దీంతో రేసులోని అభ్యర్థులు ఆయా ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టే పనిలో ఉన్నారు. గతంలో పీసీ చైర్మన్లుగా గడిపూడి నరసింహారావు, వీర భుజంగరాయలు పనిచేశారు.

సంక్రాంతికి సాధ్యమేనా?

456 రోడ్లకు 19 పనులే పూర్తి

- వారం లక్ష్యాలు నిర్దేశించినా విఫలం
- పనులపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- నత్తనడకన గుంతల రహిత రహదారుల పనులు
- గుంతల రహదారులతో వాహనచోదకుల ఇక్కట్లు

నత్తతో పోటీ...

- గుంటూరు జిల్లాలో 134 ప్యాకేజీల్లో చేపట్టిన గుంతల పూడ్చివేత పనులకు రూ.28.94 కోట్లు మంజూరయ్యాయి. అయితే రూ.10.24 కోట్లతో 10 పనులు చేపట్టగా రూ.3.03 కోట్ల విలువైన ఒక్క ప్యాకేజీలోని పని మాత్రమే పూర్తిచేశారు. 535 కిలోమీటర్ల మేర రహదారుల్లో పనులు చేపట్టగా ఇప్పటికి 69.40 కిలోమీటర్లల్లో మాత్రమే పనులు పూర్తి చేశారు.
- పల్నాడు జిల్లాలో రూ.38.56 కోట్లతో 910 కిలోమీటర్లలో 124 పనులు మంజూరు చేశారు. వీటిలో 170.50 కిలోమీటర్ల మేర 18 ప్యాకేజీల్లో రూ.2.82 కోట్ల పనులు మాత్రమే పూర్తి అయ్యాయి.
- బాపట్ల జిల్లాలో 708.50 కిలోమీటర్లలో గుంతల పూడ్చివేత పనులను 198 ప్యాకేజీలుగా విభజించారు. రూ.46.79కోట్లతో పనులు చేపట్టగా ఇప్పటికి 55.02 కిలోమీటర్ల రోడ్లపై గుంతలు పూడ్చివేశారు. ఒక్క ప్యాకేజీలో కూడా పూర్తిస్థాయిలో పనులు పూర్తికానట్లు ప్రభుత్వ నివేదికలు తెలియజేస్తున్నాయి.

జానపాడు రహదారిలో గుంతలు





పనికుంట ప్రాంతంలో గుంతలు

పనులు పురోగతి ఇలా..

జిల్లా	మంజూరు	చేపట్టినవి	పూర్తయినవి
పల్నాడు	124	38	18
బాపట్ల	198	29	నిల్
గుంటూరు	134	19	1

గోతుల రహదారులు సంక్రాంతి నాటికి కనిపించవు.. వైసీపీ హయాంలో ప్రజలు గుంతల రోడ్లతో పడిన ఇబ్బందులు ఇక ఉండవు.. అని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. గత నెలలో గుంతల రహిత రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పనులు చేపట్టేందుకు పెద్ద ఎత్తున నిధులు కూడా మంజూరు చేసింది. ఆర్భాటంగా పనులను ప్రజాప్రతినిధులు ఎక్కడికక్కడ ప్రారంభించారు. అయితే కొన్ని దగ్గర్ల శరవేగంగా పనులు జరుగుతుండగా చాలాప్రాంతాల్లో గుంతల పూడ్చివేత పనులు అరకొరగా.. నత్తనడకన సాగుతున్నాయి. పనులు సాగుతున్న తీరును చూస్తే సంక్రాంతి నాటికి గోతుల రహిత రహదారుల లక్ష్యం అసాధ్యంగా కనిపిస్తోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో రోడ్ల పనులను 456 ప్యాకేజీలుగా విభజించి మరమ్మతులు చేపట్టగా ఇప్పటికి 19 పనులే పూర్తి చేశారు. దీనినిబట్టి ప్రభుత్వ లక్ష్యంపై అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రధాన రహదారుల నుంచి సందుగొందుల్లోని రోడ్ల వరకు గోతుల మయం. వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్ల అభివృద్ధి కాదు కదా.. కనీసం గుంతల పూడ్చాలన్న ఆలోచన చేయలేదు. దీంతో గుంతల రహదారులతో ప్రమాదాలు తరచూ జరగడం.. మరణాలు, గాయపడటం వాహన చోదకులకు పరిపాటిగా మారింది. ఈ పరిస్థితుల్లో ప్రజలు రోడ్డెక్కాలంటే వణికిపోవాల్సి వచ్చింది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల రహదారులను విస్మరించగా కూటమి ప్రభుత్వం రోడ్లపై దృష్టిసారించింది. రహదారులను అభివృద్ధి చేస్తామని, గుంతలు లేని రహదారులను నిర్మిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే అధికారం చేపట్టిన తర్వాత కూటమి ప్రభుత్వం గుంతల రహిత రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పెద్దఎత్తున నిధులు మంజూరు చేసి సంక్రాంతి కల్లా గుంతలు లేని రహదారులను తీర్చిదిద్దుతామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే పనులు చేపట్టి నెల దాటుతున్నా.. ప్రభుత్వ లక్ష్యాలు

(మిగతా 8వ పేజీలో)



వక్ఫ్‌బోర్డు చైర్మన్‌కు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే నసీర్

‘వక్ఫ్’ ఆస్తుల పరిరక్షణకు కంచెలా పని చేస్తాం: ఎమ్మెల్యే

గుంటూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు కంచెలా పని చేస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, వక్ఫ్ బోర్డు సభ్యుడు మొహమ్మద్ నసీర్ అన్నారు. విజయవాడలోని వక్ఫ్ బోర్డు రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన చైర్మన్ ఎంపిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. నసీర్ తో పాటు మిగిలిన సభ్యులు చైర్మన్‌గా అబ్దుల్ అజీజ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చట్ట నిబంధనలకు అనుగుణంగా నూతన కార్యవర్గం పని చేస్తుందని, సంస్థను మరింత బలోపేతం చేసేందుకు, సంస్థ అభివృద్ధికి కొత్తదారులు ప్రణాళికలతో కమిటీ ముందుకు వెళుతుందని తెలిపారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కంచెలాగా పని చేస్తామన్నారు. ఈ కమిటీ వినూత్న వ్యూహాలను అమలు చేయడంలో, కమ్యూనిటీతో సహకారం పెంపొందించడంలో, ప్రత్యేక లక్ష్యం సాధనలో కీలకమైన పాత్ర పోషిస్తుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ముస్లింల ఆత్మ గౌరవం కాపాడటమే లక్ష్యంగా పని చేస్తోందని తెలిపారు. మైనారిటీల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక పథకాలు ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి పాటుపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు సభ్యులు తమీమ్ అన్సారీయా ఐఏఎస్, హాజీ ముక్రం హుస్సేన్, సయ్యద్ దావూద్ బాషా, షేక్ అక్రమ్, అఫియా, షేక్ ఖాజా మొహిద్దిన్ మోతవల్లి, మహమ్మద్ ఇస్మాయిల్ బేగ్, వక్ఫ్ సీఈఓ అబ్దుల్ ఖాదిర్ పాల్గొన్నారు.

19న బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు ఎన్‌సీసీ కోటా కౌన్సెలింగ్

గుంటూరు సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్ కోర్సు ఎన్‌సీసీ కోటా కౌన్సెలింగ్ ఈ నెల 19న నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని రిజిస్ట్రార్ డాక్టర్ జీ రామచంద్రరావు తెలిపారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

విదర్భ 205 పరుగులకు ఆలౌట్



ఓం ధోత్రే (70 పరుగులు)

మంగళగిరి సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో రాజస్థాన్, విదర్భ జట్ల మధ్య మూడు రోజుల మ్యాచ్ మంగళవారం ప్రారంభమైంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విదర్భ జట్టు 73.4 ఓవర్లలో 205 పరుగులు చేసి ఆలౌట్ అయింది. విదర్భ బ్యాటర్లు ఓం ధోత్రే 12 ఫోర్లతో 70 పరుగులు, కశ్యప్ 35 పరుగులు చేశారు. రాజస్థాన్ బౌలర్లు పురు దేవద్వాల్, సుజల్ పార్మర్, ఆదిత్య వాద్వా మూడేసి వికెట్లు చొప్పున తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్‌లో బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ జట్టు ఆట ముగిసే సమయానికి 5 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 4 పరుగులు చేసింది.

ఆక్రమణలు, భూ సమస్యలపై వినతులు

- 52వ రోజు ‘ప్రజాదర్బార్’లో అర్జీలు స్వీకరించిన మంత్రి లోకేశ్



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న అర్జీదారులు

తాడేపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యతో ఒకరు, పథకాలు ఇప్పించాలని మరొకరు భూ సమస్యలతో కొందరు.. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు అర్జీదారులు తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీదారులు మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. 52వ రోజు ప్రజాదర్బార్ మంగళవారం అర్జీదారులతో కిటకిటలాడింది. మంత్రి లోకేశ్‌ను ఆయన నివాసంలో కలిసిన అర్జీదారులు తమ వినతిపత్రాలు సమర్పించారు.

ఆప్షన్ 2 అమలు చేయండి

చీరాల ఓడరేవు నుంచి నకిరేకల్లు వరకు 167ఏ నాలుగు లేన్ల జాతీయ రహదారిని ఎన్‌హెచ్ఏ అధికారులు 2022లో ప్రతిపాదించారు. ఇందులో అంతర్భాగంగా ఉన్న నర్సరావుపేట బైపాస్ నిర్మాణానికి మూడు ఆప్షన్లు ఇచ్చారు. ఇందులో నరసరావుపేట దక్షిణం వైపు బైపాస్‌కు ప్రతిపాదించిన ఆప్షన్ 3 వల్ల ఐదు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున రైతులు నష్టపోవాల్సి వస్తుంది. రైతులకు తక్కువ నష్టం కలిగించే ఆప్షన్ 2ను అమలు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే అరవిందబాబు నేతృత్వంలో మంత్రి లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

కుదువపెట్టిన బంగారం ఇవ్వట్లేదు

కరోనా సమయంలో తన బిడ్డ వైద్యం కోసం కుదువ పెట్టిన బంగారాన్ని ఇవ్వకుండా తన మేనమామ వేధిస్తున్నాడని జగ్గయ్యపేట నియోజకవర్గం తోటచర్లకు పద్మావతి ఆవేదన వ్యక్తం చేసింది. 120 గ్రాముల బంగారాన్ని మేనమామ వెంకటేశ్వరరావు వద్ద కుదువపెటి రూ.3 లక్షలు అప్పు తెచ్చి వైద్యం చేయించినా బిడ్డ బతకలేదని 2019లో రెండవ బిడ్డ యాక్సిడెంట్‌లో చనిపోయాడని పేర్కొన్నారు. తాను అప్పుగా తీసుకున్న డబ్బులు ఇస్తానన్నా కుదువపెట్టిన బంగారం తిరిగి ఇవ్వడం లేదని, పోలీసు అధికారులకు చెప్పినా న్యాయం జరగలేదని లోకేశ్‌కు విన్నవించారు.

పింఛన్ ఇప్పించండి

పుట్టుకతో తీవ్ర అనారోగ్యంతో జన్మించిన తన బిడ్డకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బద్వేలుకు చెందిన కొండమ్మ విన్నవించింది. ఒళ్లంతా పొక్కులతో కొలేడన్ బేబిగా జన్మించిన తన బిడ్డకు తమిళనాడులోని కంచి కామకోటి హాస్పిటల్‌లో రూ.17లక్షలు ఖర్చు చేసినా ప్రయోజనం లేకపోయిందని, కలెక్టర్‌కు విన్నవిస్తే కడప రిమ్స్‌కు రాశారని, అక్కడ కూడా సరైన మందులు ఇవ్వడం లేదని తెలిపారు. ప్రైవేటుగా కొనుగోలు చేస్తే నెలకు రూ.10 వేలు ఖర్చు అవుతుందని, రెక్కాడితేగాని డొక్కాడని తమకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. మరో వినతిలో.. యాక్సిడెంట్ తరువాత కోమాలోకి వెళ్లిన బిడ్డ వైద్యానికి రూ.18 లక్షలు ఖర్చు చేసిన ప్రయోజనం లేదని, ఇప్పటికీ వీల్‌చైర్‌కే పరిమితమయ్యాడని, డ్రైవర్‌గా ఉన్న తాను పక్షవాతానికి గురయ్యానని, తన కుటుంబాన్ని ఆదుకోవాలని మైదుకూరు ప్రాంతానికి చెందిన అశోక్ విన్నవించారు.

బిల్లుల చెల్లింపుపై వినతి

వైసీపీ నేతల అండతో ఓ వ్యక్తి విశాఖలోని తమ స్థలాన్ని ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నాడని తెనాలి నియోజవర్గం మోపర్రుకు చెందిన కృష్ణప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్వాడీ భవన నిర్మాణానికి సంబంధించి బిల్లులు చెల్లించి ఆదుకోవాలని గారపాడుకు చెందిన మేస్త్రీ వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. 2018లో ముట్లూరులో రెండు, గారపాడులో ఒకటి, అంగన్వాడీ భవనాలు నిర్మించి రూ.30 లక్షలు వెచ్చిస్తే ఆనాటి టీడీపీ ప్రభుత్వం రూ.11 లక్షలు ఇచ్చిందని, వైసీపీ వచ్చాక ఐదేళ్లు తిప్పించుకుని రూ.4లక్షలు ఇచ్చారని, వైసీపీ రంగులు వేయడానికి మరో ఆరు లక్షలు ఖర్చు చేయించారని కలెక్టర్ చుట్టూ తిరిగినా ఉపయోగం లేదని, అప్పుల పాలైన తనకు బిల్లులు నగదు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. రోడ్డు పేరుతో తమ ఇళ్లు తొలగించవద్దంటూ ఈ-11 రోడ్డు ఇళ్ల బాధితులు సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవితో ప్రజాదర్బార్‌కు విచ్చేసి వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల నుంచి వినతిపత్రాలను స్వీకరించిన లోకేశ్ వారికి అండగా ఉంటానని, అధైర్యపడొద్దని హామీ ఇచ్చారు.

దాతృత్వానికి ప్రతీక డాక్టర్ పీవీజీ రాజు

- శతజయంతి వేడుకల్లో మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు



పాటిబండ్ల విష్ణువర్ధన్‌ను సత్కరిస్తున్న అశోక్ గజపతిరాజు, బుద్ధ ప్రసాద్, గజల్ శ్రీనివాస్, లక్ష్మణ్ రెడ్డి తదితరులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): డాక్టర్ పీవీజీ రాజు మంచి మనసున్న మహారాజు అని, దాతృత్వానికి నిలువుటద్దమని, అలాంటి కుటుంబంలో జన్మించే అవకాశం కలగడం భగవంతుడు అందించిన వరం అని కేంద్ర మాజీ మంత్రి పూసపాటి. అశోక్ గజపతిరాజు అన్నారు. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో డాక్టర్ పీవీజీ రాజు శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అశోక్ గజపతిరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీజీ రాజు విద్యా పురస్కారాలను శారదా నికేతన్ వ్యవస్థాపకులు ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీ బాయమ్మ దంపతుల వారసురాలు వీ హేమ, పాటిబండ్ల సీతారామయ్య హై స్కూల్ వ్యవస్థాపకులు పాటిబండ్ల సీతారామయ్య మనువడు పాటి బండ్ల విష్ణువర్ధన్‌కు, హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ ఆల్ (హీల్) వ్యవస్థాపకులు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్‌కు అశోక్ గజపతిరాజు చేతులు మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ ఎదిగే కొద్ది అహం పెంచుకోవద్దని, సమయపాలన పాటించాలని, సాధారణ వ్యక్తులుగా క్రమశిక్షణతో పెరగాలని చెప్పిన తన తండ్రి మాటలను గౌరవిస్తూ జీవిస్తున్నట్లు చెప్పారు. ప్రాథమిక విద్య మాతృ భాషలో ఉండాలని అన్నారు. గత ప్రభుత్వం ప్రాథమిక విద్యలో మాతృభాషను తొలగించడం వలన 10 లక్షల మంది బాల బాలికలు విద్యకు దూరమయ్యారని, వేలాది పాఠశాలలు మూతపడ్డాయని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర రాజధానిని తాకట్టు పెట్టిందని, విమర్శించారు. ఒట్టి మాటలకే పరిమితమైన రాజకీయ వ్యవస్థను నిర్మూలించాలన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పీవీజీ రాజు ఐదుసార్లు ఎమ్మెల్యేగా, నాలుగు సార్లు లోక్‌సభ సభ్యునిగా, ఆంధ్ర ప్రదేశ్ విద్యాశాఖ మంత్రిగా పని చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి మాట్లాడుతూ ఉత్తర కోస్తా జిల్లాలలో విజయనగర రాజుల నుంచి ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని మేలు పొందని వారు లేరన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ నేడున్న రాజ కీయ నేతలు పీవీజీ రాజును ఆదర్శంగా తీసుకుని నిరాడంబరంగా, నిజాయితీతో పనిచేయాలన్నారు. ప్రముఖ గాయకులు గజల్ శ్రీనివాస్ ప్రసంగిస్తూ పీవీజీ రాజు 250 ఎకరాల విస్తీర్ణంలో గల తన ప్యాలె స్‌ను కోరుకొండ సైనిక్ స్కూల్‌కి విరాళంగా ఇచ్చి భారతదేశంలో మొదటి సైనిక్ స్కూల్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. పెనుమెత్స నాగరాజు సహకారంతో ప్రచురించిన పూసపాటి రాజుల యొక్క పూర్వో త్తరం చారిత్రిక గ్రంథాన్ని అశోక్ గజపతిరాజు ఆవిష్క రించారు. తొలుత పీవీజీ రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ‘మాన వత’ నేతలు పావులూరి రమేష్, టీ ధనుంజయరెడ్డి, రెడ్ క్రాస్ డిస్ట్రిక్ ఫీల్డ్ ఆఫీసర్ షేక్ జానీ రసూల్, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఇండియన్ టొబాకో అసోసియేషన్ కార్యదర్శి యార్లగడ్డ చౌదరి పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు ప్రజల సహకారం అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న సత్తెనపల్లి డీఎస్పీ ఎం హనుమంతరావు, సీఐ సురేష్, ఎస్సై వేణుగోపాల్, పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులు (ముసుగులో)

రాజుపాలెం,డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): గంజాయిని పూర్తి స్థాయిలో నిర్మూలించాలంటే ప్రజల సహకారం అవసరమని సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు అన్నారు. మండల కేంద్రమైన రాజుపాలెం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి నిర్మూలనపై గ్రామ స్థాయిలో, కళాశాలలో, పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో గంజాయిని విక్రయిస్తున్నారని, గంజాయికి ఎనిమిదో తరగతి విద్యార్థులు అలవాటు పడటం బాధ కలిగిస్తోందన్నారు. గంజాయి సేవించిన వారు ఎలా ప్రవర్తిస్తారో వారికే తెలియదన్నారు. మీ ప్రాంతాలలో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే కనుక సమీపంలోని పోలీస్‌స్టేషన్లో గానీ, 100కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని అన్నారు. గంజాయి విక్రయదారుల అరెస్టు విషయం విలేకరులకు తెలిపారు. మండలంలోని చౌటపాపాయపాలెంలో సోమవారం సాయంత్రం రైల్వేగేటు దగ్గర క్రోసూరు మండలం పారుపల్లికి చెందిన పారుపల్లి భూలక్ష్మీ చౌటపాపాయపాలెంకు చెందిన కుందూరు దుర్గారావు, వల్లాల ప్రసాదులకు గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు మెరుపుదాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారివద్ద ఉన్న సుమారు 2కెజీల గంజాయి, 2 సెల్‌ఫోన్లు, రూ.3100నగదు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయిస్తున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

జూనియర్స్ విభాగంలో బాపట్ల ఎడ్ల జతకు ప్రథమ స్థానం



జూనియర్స్ విభాగంలో ప్రథమస్థానం సాధించిన బాపట్ల ఎడ్ల జత

గురజాలటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని పట్టణంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో భాగంగా మంగళవారం జూనియర్స్ విభాగంలో పోటీలు జరిపారు. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత నిర్ణీత సమయంలో 4000 అడుగుల దూరం బండ లాగి ప్రథమస్థానంలో నిలిచింది. హైదరాబాద్‌కు చెందిన రోహన్‌బాబు ఎడ్ల జత 3900.5 అడుగులతో రెండోస్థానం, హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేంద్రరెడ్డి ఎడ్లజత 3831 అడుగులతో మూడో స్థానం, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన జత 3804.6 అడుగులతో నాలుగో స్థానం, హైదరాబాద్‌కు చెందిన ఎడ్లజత 3723.2 అడుగులతో ఐదో స్థానంలో నిలిచాయి.

56,204 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 59,536 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 56,202 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 46,133 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14500	334	7500	14500
నెంబరు. 5	8000	12500	నెంబరు.5	8000	12000
273	12000	12000	273	8500	11500
341	8000	15000	341	7500	14000
4884	9000	10000	4884	10500	14200
సూపర్ 10	-	-	సూపర్ 10	10000	15200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16300	తేజ	7500	16500
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	8000	14000
దేవనూరు డీలక్స్	9500	15000	దేవనూరు డీలక్స్	9000	13000
తెల్లకాయలు	4000	11500	తెల్లకాయలు	4500	11000

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 579.60 అడు గులు ఉంది. ఇది 281.85 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7086 క్యూసెక్కులు, ఎడమకాలువ ద్వారా 7852 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 17,638 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 17,638 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- ఇసుక రీచ్‌ని పరిశీలించిన విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రావణ్‌కుమార్



మున్నంగి ఇసుకరీచ్‌ని పరిశీలిస్తున్న రీజనల్ విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రావణ్‌కుమార్, మైనింగ్ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొల్లిపర, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ‘ఉచితమన్నా దోపిడీనే’ అనే శీర్షికను ‘ఆంధ్రజ్యోతి’లో ఆదివారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎస్పీ సూర్య శ్రావణకుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్, మైనింగ్, రెవెన్యూ అధికారులు మంగళవారం మండల పరిధిలోని మున్నంగి ఇసుకరీచ్‌ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇసుకలోడింగ్ చేస్తున్న ప్రదేశాన్ని పరిశీలించి అక్కడ కూలీలను వాహనాలకు లోడింగ్ చేసినందుకు నిర్వాహకులు ఎంత ఇస్తున్నారు, కృష్ణానదిలో యంత్రాల ద్వారా ఏమైనా లోడింగ్ చేస్తున్నారా, లోడింగ్ చేసినందుకు ప్రభుత్వం ఇచ్చిన ధర కన్నా అధికంగా వసూళ్లకు పాల్పడుతున్నారా అనే విషయాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సూర్యశ్రావణకుమార్ మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల్లో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. కృష్ణా నదిలో యంత్రాల ద్వారా లోడింగ్ చేసిన, అధికంగా వసూళ్లు చేసినా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుకరీచ్‌ని తనిఖీ చేసిన వారిలో విజిలెన్స్ సీఐలు కొమ్మాలపాటి చంద్రశేఖర్, పీ శివాజీ, మైనింగ్ అధికారి కావ్య ఉన్నారు.

మళ్లీ పరుగులెత్తనున్న ‘పోలవరం’: కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి పర్యటనతో పోలవరం ప్రాజెక్టు పనులు మళ్లీ పరుగులెత్తనున్నాయని టీడీపీ పల్నాడు జిల్లా అధ్య క్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన ‘పోల వరం’, రాజధాని అమరావతి రెండు కళ్ళు వంటివని, గత ఐదేళ్లుగా ఈ రెండు నిర్లక్ష్యానికి గురవడమే కాకుండా సర్వ నాశనం చేశారని విమర్శించారు. ఈ రెండింటిని మళ్లీ ట్రాక్‌పైకి తీసు కొచ్చేందుకు చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. పోలవరం ప్రాజెక్టును త్వరి గతిన పూర్తి చేసేందుకు కేంద్ర జల సంఘం, పోలవరం అథారిటీతో చర్చలు జరిపి దిశానిర్దేశం చేశారని, ఈ ప్రాజెక్టు పూర్తి చేసి నదుల అనుసంధానంతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో పని చేస్తున్నారన్నారు.

పాతగుంటూరు శివార్లలో యువకుడి హత్య

- డబ్బు విషయమై మద్యం మత్తులో దాడి
- పరారీలో ఐదుగురు నిందితులు



హత్యకు గురైన దీపక్

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పాత గుంటూరు శివా ర్లలో యువకుడు హత్యకు గురైన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. స్థానిక పాత గుం టూరు పోలీసుల కథనం ప్రకారం, తెనాలి చెంచు పేటకు చెందిన యువ కుడు చప్పిడి దీపక్ (25) మద్యానికి బానిసయ్యాడు. కొంతకాలం విశాఖపట్నంలో నివసించిన అతను, అనా రోగ్య సమ స్యలు తలెత్తడంతో తిరిగి తెనాలికి వచ్చాడు. గుంటూరులోని ఎస్వీఎన్ కాలనీకి చెందిన యువకుడు గద్దల కిరణ్‌తో స్నేహం ఏర్పడింది. వీరిద్దరూ తరచుగా మద్యం తాగేవారు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరిలో కిరణ్ ఫోన్ పే నుంచి రూ. 50 వేలు, దీపక్ తన ఫోన్ పే కి కొట్టుకున్నాడు. ఈ విషయం తెలుసు కున్న కిరణ్, తన డబ్బులు తనకు తిరిగి ఇవ్వమని దీపక్‌ను పలుమార్లు అడిగాడు. డబ్బులు ఇవ్వకుండా దీపక్ వాయిదా వేస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం వాళ్లిద్దరూ తెనాలిలో మద్యం తాగారు. గత రాత్రి వీళ్లిద్దరూ గుం టూరులో కలుసుకుని మద్యం తాగాలని నిర్ణయించుకున్నారు. స్థానిక పాత గుంటూరుకు చెందిన తన స్నేహితులు శివశం కర్, అశోక్, గోపి, అక్బర్‌లను వెంటబెట్టుకొని వెళ్లిన కిరణ్, శివారు ప్రాంతాల్లోని రాజీవ్ గృహకల్ప వద్ద అర్ధరాత్రి వరకు మద్యం తాగారు. ఈ క్రమంలో దీపక్, కిరణ్‌ల మధ్య డబ్బు వివాదం జరిగింది. తనకు డబ్బులు ఇవ్వాలని కిరణ్ గట్టిగా నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది, కిరణ్, తన వెంట వచ్చిన వారు కలిసి దీపక్ పై దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన దీపక్ ను వైద్య చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఆటో మాట్లాడి తరలించారు. అయితే, ఆటో డ్రైవర్‌కి దీపక్ పేరును వెంకటరెడ్డి అని చెప్పి పంపించారు. జీజీహెచ్‌లో చేర్పించిన ఆటో డ్రైవర్, క్షతగాత్రుడు పేరుని వెంకట్ రెడ్డి అని నమోదు చేయించారు. చికిత్స పొందుతున్న దీపక్ తెల్లవారుజామున మృతి చెందాడు. దీపక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ కేసులో ఐదుగురు నిందితులు పరారీ లో ఉన్నట్లు పాత గుంటూరు పోలీసులు తెలిపారు.

భర్తకు జైలు, జరిమానా

నరసరావుపేట లీగల్, డిసెంబర్ 17(ఆంధ్రజ్యోతి) : భార్య మృతికి కారకుడైన భర్తకు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు. ఈ మేరకు స్థానిక అదనపు సహాయ సెషన్స్ న్యాయమూర్తి కే మధుస్వామి మంగళవారం తీర్పు నిచ్చారు. పద్దెనిమిదేళ్ల క్రితంచిలకలూరిపేటకి చెందిన దేశవత్ హనుమంతరావు నాయక్ వివాహం రమణ బాయితో జరిగింది. 2000 సంవత్సరం నుంచి మద్యానికి బానిసైన హనుమంతరావు తన భార్యను వేధించేవాడు. ఈ క్రమంలో 2021 నవంబరు 30న ఎలుకల మందు తీసుకుని రమణబాయి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న చిలకలూరిపేట పట్టణ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కోర్టుతీర్పు వెలువడింది. శిక్ష మొత్తాన్ని ఏకకాలంలో అనుభవించేలా న్యాయ అధికారి తీర్పులో పేర్కొన్నారు.

ఎల్ఎల్ఎం, ఎల్ఎల్‌బీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

పెదకాకాని, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం లోని ఆర్ట్స్ కళాశాలలో ఉన్న ఎల్ఎల్ఎం, కోర్సుతోపాటు బీఏ ఎల్ఎల్‌బీ బీబీఏ ఎల్ఎల్‌బీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులకు ఈ నెల 23న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ పీ బ్రహ్మజీరావు మంగళవారం తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవే శాలు పొందేందుకు ఏపీ లా సెట్/ పీజీ లా సెట్ 2024 లో ర్యాంకులు సాధించిన వారికి మాత్రమే ప్రవేశాలు కల్పించ నున్నట్లు స్పష్టం చేశారు. ఈ కోర్సులలో ప్రవేశాలు పొందే అభ్యర్థులు 23 ఉదయం 10 నుంచి 12 గంటల వరకు రిజి స్ట్రేషన్ చేసుకోవాలని సూచిం చారు. ఎల్ఎల్ఎం కోర్సులో ఇంటర్నల్ స్లైడింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 18న ఉదయం 10 నుంచి 2 గంటల వరకు వర్సిటీ లోని ఆర్ట్స్ కళాశాలలో ఈ ఇంటర్నల్ స్లైడింగ్ చే పట్టనున్నట్లు పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.10
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107,115,126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

సాగు నీటి సంఘాలకు ప్రభుత్వం ప్రాధాన్యం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన చిన్న అప్పారావును అభినందిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పక్కన బాజీ చౌదరి

నకరికల్లు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి, సాగునీటి కాలువల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం నరసరావుపేట డీసీ -23కు ఉపాధ్యక్షుడిగా నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామానికి చెందిన సాతులూరి చిన అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరి, సాతులూరి చిన్నా అప్పారావులు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణను కలిశారు. కన్నా చిన్న అప్పారావుకు శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో ఘంటా జగదీష్, గార్లపాటి వెంకటేశ్వర్లు, కొల్లి హరిప్రసాదులు పాల్గొన్నారు.

నకరికల్లు డీసీ-10 అధ్యక్షుడిగా మోహన్‌బాబు

నకరికల్లు డిస్ట్రిబ్యూటరీ కమిటీ - 10కి అధ్యడిగాగా రెంటపాళ్ళకు చెందిన చెన్న మల్లి మోహన్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి పీ విభీషణ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా పాకాలపాడుకు చెందిన కాల్వపల్లి శ్రీనివాస రెడ్డి ఎన్నికయ్యారన్నారు. కార్యక్రమంలో ఏఈ ఖాశిం, మక్కపాటి రామచంద్ర రావు, షేక్ అలీ బాషా, కొనికినేని వెంకటప్పయ్య, సాగి శ్రీనివాసరావు, తిరుమలశెట్టి వెంకటరావు, రుసుం సైదారావు, అహమ్మద్, వలి ఉన్నారు.

బాధితులకు అండగా సీఎం సహాయ నిధి

సత్తెనపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బాధితులకు అండగా సీఎం సహాయ నిధి ఉంటుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు అందించారు. సత్తెనపల్లి మండలం అబ్బూరుకు చెందిన వై అనూషాకు రూ.1,48,952, గుజ్జర్లపూడికి చెందిన జీ మధుసూదన్‌కు రూ.1,46,075, నకరికల్లుకు చెందిన తిరుమలశెట్టి వెంకయ్యకు రూ.1,60,990లు, ముప్పాళ్ళ మండలం గోళ్ళపాడుకు చెందిన సింకా నాగేంద్రకు రూ.1,03,926 చెక్కులను కన్నా అందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి, నాయకులు మక్కపాటి రామచంద్రరరావు, కట్టా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్లకు దక్కిన గౌరవం

● అభివృద్ధిలో నేతలు పోటీపడాలి : ఎమ్మెల్యే యరపతినేని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన వారందరికి సముచిత స్థానం కల్పిస్తానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. డీసీ కమిటీ అధ్యక్షులు, సాగునీటి సంఘాల అధ్యక్షులతో మంగళవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో యరపతినేని మాట్లాడుతూ నేతలు గ్రామ స్థాయి నుంచి అభివృద్ధి వైపు పోటీపడాలని, గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ఏ విధంగా అభివృద్ధి చేయాలో ప్రణాళికలు తయారు చేయాలన్నారు. గుత్తికొండబిళం, దైద, భట్రుపాలెం, మోర్జంపాడు దేవాలయాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేస్తున్నామని యరపతినేని తెలిపారు. గురజాల నియోజకవర్గపరిధిలో 2 లక్షల ఆయకట్టు భూమి ఉందని, రైతులు సాగు చేస్తున్న పంటలను రైతు చేతికి అందేలా చేయడం తన చిరకాల వాంఛ అని చెప్పారు. సంక్రాంతి తరువాత మూడు నెలలు నియోజకవర్గంలోనే క్షేత్రస్థాయిలో పర్యటి స్తానని, కార్యకర్తలు కూడా స్పీడ్ పెంచాలని సూచించారు. ఎన్నికల్లో కష్టపడి నావద్దకు వచ్చిన వారికి, రాలేకపోయిన వారికి కూడా పద వుల ప్రాధాన్యం కల్పిస్తానన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదు మొదట్లో నెమ్మదించి 170వ ర్యాంకులో ఉందని, గత వారం 18వ ర్యాంకు, నేడు 8వ ర్యాంకుకు నియోజకవర్గం చేరుకుందన్నారు. మరో వారం రోజుల్లో కుప్పం, మంగళగిరి నియోజకవర్గాల తరువాత స్థానంలో గురజాల ఉండేలా కార్యకర్తలు, నాయకులు టార్గెట్ పూర్తి చేయాలని యరపతినేని కార్యకర్తలకు, నాయకులకు దిశ నిర్దేశం చేశారు.

సీనియర్లకు సముచిత స్థానం

నియోజకవర్గంలో కూటమి నేతలకు సముచిత స్థానం దక్కింది. ఎన్నో ఏళ్లుగా పార్టీకి సేవలందిస్తూ గత ఐదేళ్ల వైసీపీ నేతల అరాచకాలకు ఎన్నో ఇబ్బందులుపడిన నేతలకు నేడు ఎమ్మెల్యే యరపతినేని నిర్ణయం సంతోషాన్ని ఇచ్చింది. సాగునీటి సంఘాల అధ్యక్షులు, డీసీ అధ్యక్షులుగా సీనియర్లను నియమించడంతో పాటు జనసేన, బీజేపీ నేతలకు కూడా సాగునీటి సంఘాల్లో పదవుల కేటాయిండంతో ఎమ్మెల్యే యరపతినేని నిర్ణయంపై కూటమి నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం సాగునీటి సంఘాల అధ్యక్షులు, డీసీ అధ్యక్షులను ఎమ్మెల్యే యరపతినేని సన్మానించారు. ఈ సమావేశంలో డీసీ అధ్యక్షులుగా ఎంపికైన పులుకూరి కాంతారావు, యాగంటి రామా రావు, గండికోట వెంకటేశ్వర్లు, పగడాల భాస్కరరావుతో పాటు డాక్టర్ వున్నం నాగమల్లి కార్జునరావు, వేముల వినోద్‌రెడ్డి, షేక్ బాబావలి, వడ్డ వల్లి సర్వేశ్వరరావు, పాండురంగ శ్రీను, బెల్లంకొండ భద్రి, కామిశెట్టి రమేష్, నర్రా పుల్లయ్య, బడి గుంచల వెంకటేశ్వర్లు, చింతపల్లి హసన్ అహ్మద్, సయ్యద్ అమీర్‌అలి, పాదర్తి రాజేశ్వరి, పరుచూరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి యరపతినేని పరామర్శ

పట్టణంలోని 13వ వార్డుకు చెందిన షేక్ సుభాని వారం క్రితం గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం సుభాని కుటుంబసభ్యులను పరామర్శించి పిల్లలకు ధైర్యం చెప్పారు. చదువులో, ఆర్థికపరమైన అంశాల్లో తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో షేక్ బాబావలి, సయ్యద్ అమీర్‌అలి, వున్నం సురేష్, ముప్పాళ్ల సాంబయ్య, సుతారు నాగమల్లేశ్వరరావు, అంజిబాబు తదితరులున్నారు.

పెన్షనర్లకు అండగా ప్రభుత్వం

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



పెన్షనర్స్‌డేలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో మంగళవారం జరిగిన పెన్షనర్స్‌డే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల కమ్యూటేషన్ ఆఫ్ పెన్షన్ రికవరీని తగ్గించడానికి కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారని, కోర్టు తీర్పునకు అనుగుణంగా ప్రభుత్వం పెన్షనర్లపై సానుకూలంగా స్పందించిందని అన్నారు. పెన్షనర్ల సమస్యలను పూర్తిగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. నందా నరసింహయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, జక్కిరెడ్డి మర్రెడ్డి, చంద్రయ్య, గాలీబు, డాక్టర్ వెంకటేశ్వరరావు, రామనాథశర్మ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తాం

దుర్గి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి తాగునీరు, ప్రతి ఎకరానికి సాగునీరు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు తీవ్రంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బ్రహ్మానంద రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆత్మకూరు గ్రామ శివారులోని మహబూబ్‌నగర్ కాలనీ సమీపంలో మంచినీటి బోరు ఏర్పాటుకు భూమిపూజ చేశారు. కాలనీవాసులు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, మండలపరిషత్ నిధులతో బోరు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ యేచూరి సునీతా శంకర్, లింగా రమేష్, పులి హరి, రుద్రాల రవి, ముత్తినేని పుల్లయ్య, దేవరగట్టు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యం

కారంపూడి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో డీసీ-1 అధ్యక్షుడిగా పోట్ల నరసింహారావు (రెంటచింతల), డీసీ-4 పంగులూరి అంజయ్య (కారంపూడి)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరికి ఎమ్మెల్యే బ్రహ్మానంద రెడ్డి అభినందించి డిక్లరేషన్ పత్రాలు అందించారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, గోళ్ల సురేష్ యాదవ్, బొల్నేడి శ్రీనివాసరావు, కటికల బాలకృష్ణ, చప్పిడి రాము, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి హనుమంతురావు, జనసేన మండల అధ్యక్షుడు కృష్ణబాబు, ఎంపీడీవో, ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతు మోములో ఆనందం వెల్లివిరియాలి

రెంటచింతల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ప్రతి రైతు మోమున ఆనందాలు వెల్లివిరియాలని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కోరారు. డీసీ 1 అధ్యక్షుడిగా ఎంపికైన తుమ్మకోట గ్రామానికి చెందిన పోట్ల నరసింహారావు ఎమ్మె ల్యే చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, సుమంత్‌రెడ్డి, బి.రామకృష్ణ, పోట్ల సతీష్, రాయపరెడ్డి, సిద్దయ్య, మంచికల్లు శివ, ఇన్నారెడ్డి, మీరా తదితరులున్నారు.

డీసీ కమిటీ ఎంపిక ఏకగ్రీవం

పిడుగురాళ్ల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులు ఏకగ్రీవం అయ్యాయి. డీసీ-3 అధ్యక్షుడిగా పులుకూరి కాంతారావు, ఉపాధ్యక్షుడిగా ఆకూరి వెంకటరెడ్డి, డీసీ-2 అధ్యక్షుడిగా యాగంటి రామారావు, ఉపాధ్యక్షుడిగా చావా రామారావు, డీసీ-5 అధ్యక్షుడిగా గండికోట వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా భవిరిశెట్టి శివన్నారాయణ, డీసీ-6 అధ్యక్షుడిగా పగడాల భాస్కరరావు, ఉపాధ్యక్షుడిగా ఆళం చినవెంకటరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పి ఆదినారాయణ తెలిపారు.

హాస్టళ్ల మరమ్మతులకు రూ.2.50 కోట్లు విడుదల

రెంటచింతల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలోని 19 సంక్షేమ వసతిగృహాల మరమ్మతులకు రూ.2.50 కోట్లు విడుదలైనట్లు ఏపీఈడబ్ల్యూఐడీసీ (ఆంధ్రప్రదేశ్ ఎడ్యూకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఈఈ రవీంద్ర, ఏఈఈ జాన్ సైదాలు చెప్పారు. మంగళవారం రెంటచింతల ఎస్సీ బాలికల సంక్షేమ హాస్టల్‌ను పరిశీలించి మరమ్మతులు ఏ మేరకు చేపట్టాలనే దానిపై కొలతలు తీశారు. రెంటచింతలలో నూతన హాస్టల్ భవన నిర్మాణానికి రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపామ ని వాటికి అనుమతి లభిస్తే ఈ మరమ్మతుల అవసరం ఉండదన్నారు. మాచర్లలో మూడు, రెంటచింతలలో ఒక హాస్టల్‌కు కలిపి రూ.74.29 లక్షలు విడుదలయ్యాయన్నారు.

ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలి

● ఎంఈవో పినాకపాణి

దాచేపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని దాచేపల్లి ఎంఈవో పినాకపాణి కోరారు. మంగళవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. పులిపాడు గ్రామానికి చెందిన విద్యార్థి, పాఠశాల బస్సు క్లీనర్ నీటికుంటలో పడి మృతి చెందిన విషయాన్ని గుర్తుచేశారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని పనిచేయాలని లేకుంటే చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బేస్‌బాల్ పోటీల్లో అంబేద్కర్ పాఠశాల విద్యార్థిని ప్రతిభ

మాచర్ల రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల లయోలా కళాశాలలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించిన అండర్-19 బేస్‌బాల్ పోటీల్లో మండలంలోని విజయపురిసౌత్ అంబేద్కర్ పాఠశాల విద్యార్థిని అనిత ప్రథమస్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ మేరీ మంజుల తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థిని అనితను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఆర్‌డీసీ అధ్యాపకుడు వెంకటరామిరెడ్డికి సన్మానం

మాచర్ల రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్ ఏపీఆర్‌డీసీ కళాశాల అధ్యాపకుడు గుత్తికొం వెంకటరామిరెడ్డి అల్వార్ ఎస్ఆర్ యూనివర్సిటీ ద్వారా డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా మంగళవారం వెంకటరామిరెడ్డిని మాచర్ల పట్టణంలోని మదర్‌థెరిస్సా కార్యాలయంలో మదర్‌థెరిస్సా సేవాసమితి సభ్యులు దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది చిలమకూరి నాగిరెడ్డి, గాదె కిరీటిరెడ్డి, మోరా భాస్కరరెడ్డి, శ్రీనివాసరావు, బాలజోజి పాల్గొన్నారు.

ఆయుష్ వైద్యశిబిరం

బెల్లంకొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ ఎంపీపీ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆయుష్ వైద్యశిబిరం నిర్వహించినట్టు డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో హనిమిరెడ్డి హాజరై రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించేందుకు ఆయుష్ వైద్యాధికారి చేస్తున్న కృషి మరువలేనిదని అన్నారు. అనంతరం రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

వివాహిత ఆత్మహత్య

మాచర్ల రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుడికాలువలో దూకి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కంభంపాడు వద్ద జరిగింది. మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన వివారాల మేరకు.. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కొమ్ము సిరిమోని (35) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమెకు మతిస్థిమితం కూడా లేదు. ఈ క్రమంలో మంగళవారం ఆమె భర్త ఆనందబాబు పనుల నిమిత్తం మాచర్ల పట్టణానికి వచ్చారు. తిరిగి మధ్యాహ్నం సమయంలో స్వగ్రామానికి చేరుకొని గృహంలో చూడగా సిరిమోని కనిపించలేదు. దీంతో ఆమె కోసం వెతుకుతుండగా కంభంపాడు కుడికాలువ వద్ద ఆమె మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న మాచర్ల రూరల్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

బెల్లంఊట ధ్వంసం

మాచర్ల రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాచర్ల ఎక్సైజ్ శాఖ సీఐ వెంకటరమణ ఆధ్వర్యాన మంగళవారం వెల్దుర్తి మండలం గుండ్లపాడులో దాడులు జరిపారు. గ్రామంలో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 4700 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేశారు. అధికారుల రాకను గమనించిన సారా తయారీదారులు పరారయ్యారు. ఈ సందర్భంగా సీఐ వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లో సారా, అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలన్నారు.

పురుగుమందులు అధిక రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు

బెల్లంకొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందులు అధిక రేట్లకు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఏవో కృష్ణయ్య అన్నారు. మంగళవారం బెల్లంకొండ పురుగు మందులు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారమే ఎరువులు విక్రయించాలని, అధిక రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలతో పాటు షాపు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరువుల ధరల పట్టికను షాపు ముందు ఉంచాలని సూచించారు.

చివరి భూములకు సాగునీరు అందించాలి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కాల్వ చివరి భూములకు సాగు నీరందించేందుకు నూతనంగా ఎన్నికైన డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కృషి చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెదకూరపాడు నియోజకవర్గంలోని నాలుగు డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు జరిగిన ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన వారిని, సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన వారిని ఎమ్మెల్యే ప్రవీణ్ ఘనంగా సన్మానించారు. పెదకూరపాడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా వడ్లమూడి అప్పారావు, ఉపాధ్యక్షుడిగా మండాది నరసింమారావు, అమరావతి డీసీ అధ్యక్షుడిగా భవిరిశెట్టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పతకమూరి రామారావు, క్రోసూరు డీసీ అధ్యక్షుడిగా దూళ్ళ సాంబశివరావు, ఉపాధ్యక్షుడిగా కందుల నాగేశ్వరరావు, చామర్రు డీసీ అధ్యక్షుడిగా పసుపులేటి పాపిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కూకట్ల గోపీలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, కిలారు రాజన్‌బాబు, మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, నందిగామ ఆశీర్వాదం, బాషా, మల్లాది విష్ణు, నల్లమేకల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



జూలకల్లు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ మధుబాబు

పిడుగురాళ్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే దిశగా అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ మధుబాబు తెలిపారు. మంగళవారం జూలకల్లు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి పలు రెవెన్యూ అంశాలపై తహసీల్దార్ గ్రామస్థులకు అవగాహన కల్పించారు. సదస్సులో 9 అర్జీలు అందాయని తహసీల్దార్ తెలిపారు. సర్వేయర్, ఆర్ఐ, సర్పంచ్ పాల్గొన్నారు.

మాచవరం: మండలంలోని పిన్నెల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 16 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ క్షమారాణి తెలిపారు. ఈ సదస్సుల్లో మండల సర్వేయర్ సాల్మన్‌రాజు, మాజీ సర్పంచ్, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రాజుపాలెం: రెవెన్యూ సమస్యల పరిష్కారానికే సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ దుర్గేశ్వరరావు తెలిపారు. మంగళవారం మండలంలోని రాజుపాలెంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, అధికారులు, కూటమి నేతలు ఉన్నారు.

ముప్పాళ్ళ: రెవెన్యూ సదస్సుల్లో అర్జీ ఇచ్చిన ప్రతి రైతుకు రసీదు ఇస్తామని తహసీల్దార్ ఎం భవానీశంకర్ అన్నారు. మండలంలోని దమ్మాలపాడులో మంగళ వారం రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సులో సుమారు 60 మంది వివిధ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ ప్రసాదు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పెదకూరపాడు: రైతుల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తహసీల్దార్ మీసాల డానియేలు అన్నారు. మండలంలోని కంభంపాడులో గ్రామ రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన భూ సంబంధిత సమస్యలపై అర్జీలను తహసీల్దార్ స్వీకరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు మాదినేని సుబ్బయ్య, మాజీ ఎంపీటీసీ అర్తిమళ్ళ కృష్ణ, టీడీపీ మండల నాయకులు అర్తిమళ్ళ వెంకటేశ్వర్లు, మాదినేని వెంకటరావు తదితర అధికారులు ఉన్నారు.

రోడ్డు ఆక్రమించారు.. చెట్లు నరికి వేశారు

● తహసీల్దార్‌కు గ్రామస్థుల ఫిర్యాదు

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డును ఆక్రమించి తమ సొంత స్థలం అన్నట్టు హద్దు రాళ్ళు పాతటమే కాక ఎన్నో ఏళ్ళ క్రితం నుంచి ఉంటున్న చెట్లను నరికి వేశారని మండలంలోని భీమవరం గ్రామస్థులు తహసీల్దార్ కేఎస్ చక్రవర్తికి ఫిర్యాదు చేశారు. మండలంలోని భీమవరంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. గ్రామంలోని సర్వే నెంబరు 23, 24లో రెండెకరాల భూమి ఉందని, సత్తెనపల్లి నుంచి గ్రామం వెళ్లే రహదారి పక్కన ఉన్న ఈ భూమిలో ఏడేళ్ల క్రితం ఉపాధి హామీ పథకం కింద వనం మనం కార్యక్రమంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా సుమారు నాలుగు వందల మొక్కలను నాటి పంచాయతీయే వీటి పెంపకాన్ని చేపట్టిందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన రీసర్వేలో భాగంగా సదరు సర్వే నెంబరులో భూమి విస్తీర్ణం పెరిగిందని కొల్లా స్వామి, నాగుల్ మీరాలు రహదారిని ఆక్రమించి హద్దురాళ్లు పాతారని గ్రామస్థులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనం తరం ఆ సర్వే నెంబర్ల ఎదురు రోడ్డులో ఉన్న ఐదు పెద్ద చెట్లను నరికి వేశారన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి వాల్టా నిబంధనలకు వ్యతిరేకంగా చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకొని ఆక్రమించిన రోడ్డును కాపాడాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బస్సు సర్వీసులు ప్రారంభం

పిడుగురాళ్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల ఆర్టీసీ డిపో నుంచి మూడు బస్సు సర్వీసులను మంగళవారం ఎమ్మెల్యే యరపతినేని పిడుగురాళ్ల డిపోలో ప్రారంభించారు. పిడుగురాళ్ల నుంచి గుంటూరుకు, పిడుగురాళ్ల నుంచి వినుకొండకు పల్లెవెలుగు బస్సులు, పిడుగురాళ్ల నుంచి విజయవాడకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ఆయన ప్రారంభించారు. అనంతరం అదే ఆర్టీసీ బస్సులో యరపతినేని, ఆర్టీసీ అధికారులు, పార్టీ నేతలు జానపాడు రోడ్డు వరకు ప్రయాణించారు.

తాగునీరు. గాలి కలుషితమవుతున్నాయి

దాచేపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలోని దుర్గాభవాని కాలనీ సమీపంలో ఉన్న కెమికల్ ఫ్యాక్టరీ వల్ల భూగర్భజలాలు, పీల్చే గాలి కలుషితమవుతున్నాయని రైతుకూలీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మోమిన్ సైదావలి ఆరోపించారు. దుర్గాభవాని కాలనీలో నీరు రంగు, రుచి మారాయని, రాత్రివేళ కెమికల్ ఫ్యాక్టరీ నుంచి వస్తున్న వాసనతో ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నలబోతుల కేశవులు, మాతంగి బాబు, సాంబశివరావు, తమ్మిశెట్టి ఏడుకొండలు, తోట శ్రీను, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

20న జాబ్ మేళా

క్రోసూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ ఆధ్వర్యంలో ఈనెల 20న క్రోసూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా అధికారి తమ్మాజీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాకు నాలుగు కంపెనీలు హాజరవుతాయన్నారు. 10వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, బీటెక్, పోస్టుగ్రాడ్యుయేషన్, ఇతర డిప్లమో కోర్సులు విద్యార్హతగా కలిగి 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉన్న యువతీ యువకులు జాబ్ మేళా కు హాజరు కావచ్చన్నారు. అభ్యర్థులు 20వ తేదీన నేరుగా తమ బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ నకలు, పాసుపోర్టు ఫొటోలతో హాజరు కావాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. వివరాలకు 9494986164, 8074393466 నెంబర్లలో సంప్రదించాలన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో తమ పేర్లను చేసుకోవచ్చని తెలిపారు.

ప్రభుత్వాస్పత్రికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి

దాచేపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సుమారు 2 కోట్ల రూపాయలతో నిర్మించిన దాచేపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రానికి తొలగించిన విద్యుత్ సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలని స్థానిక మహిళలు నగర పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. దాచేపల్లి నగర పంచాయతీలోని లాలువారి బజారులో వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.2 కోట్ల వ్యయంతో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించి ప్రజలకు సేవలందిస్తున్నారు. ఈ ఆస్పత్రికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో వైద్య సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే తొలగించిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి ఆస్పత్రిలో రోగులకు వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక మహిళలు నగర పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

దాచేపల్లి విద్యుత్‌శాఖ ఏఈ వివరణ

దాచేపల్లి విద్యుత్‌శాఖ ఏఈ భగవాన్‌నాయక్ మాట్లాడుతూ నగర పంచాయతీలోని లాలుబజారులో ఉన్న ఆస్పత్రికి ప్రారంభం నుంచి ఇంతవరకు కరెంటు సరఫరా ఇవ్వలేదని, నగర పంచాయతీ అధికారులు విద్యుత్‌శాఖకు చెల్లించాల్సిన రూ.లక్షా 23 వేల అంచనాల నగదును చెల్లించలేదని, ఇందులో మాశాఖకు ఎటువంటి ప్రమేయం లేదన్నారు. నగర పంచాయతీ విద్యుత్ శాఖకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నగదు చెల్లిస్తే తక్షణమే విద్యుత్ సరఫరాను అందిస్తామన్నారు.

నగర పంచాయతీ కమిషనర్ వివరణ

ఈ విషయంపై దాచేపల్లి నగర పంచాయతీ అధికారులు ఓ ప్రకటనలో తెలియజేస్తూ ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది మందులు తీసుకునేందుకు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లిన సమయంలో అర్బన్ హెల్త్‌సెంటర్ మూసివేశారన్నారు. అంతేకాని వేరే కారణాలతో హెల్త్ సెంటర్ మూసివేయలేదని, ప్రజలు అపోహలకు గురికావద్దని వివరించారు.

సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యం

మండల ప్రత్యేక అధికారి శ్రీకృష్ణదేవరాయలు

మాచవరం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు కలసి సమన్వయంతో పని చేసినప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని మండల ప్రత్యేక అధికారి శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. మంగళవారం మండలపరిషత్ కార్యాలయంలో రెండో రోజు ప్రజాప్రతినిధులకు, అధికారులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధిలో లక్ష్యాలు నెరవేరాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పీ శ్రీనివాసరావు, ఈవోఆర్‌డీ వెంగళరావు, ఏవో ప్రసాదు, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి రూరల్: గ్రామ స్థాయిలో అభివృద్ధి జరిగితేనే ఆ ఫలాలు ప్రజలకు త్వరగా అందుతాయని ఎంపీడీవో బీ శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో మంగళవారం ఎల్ఎస్ డీజీ మూడో బ్యాచ్ శిక్షణ కార్యక్రమం జరిగింది. శిక్షణలో ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవటంలో భాగంగా ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. శిక్షణలో ఈవోపీఆర్‌డీ ఏ శ్రీనివాసరెడ్డి, ఎంపీహెచ్ఈవో శ్రీనివాస్, వెలుగు ఏపీఎం సమాధానం, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శృతి, వీఆర్‌వోలు, మహిళా పోలీసులు, వెటర్నరీ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్, ఎన్ఆర్‌జీ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ: గ్రామాల్లో సుపరిపాలన అందించి అభివృద్ధి చేసేందుకు శిక్షణ ఉపయోగపడుతుందని ఎంపీడీవో టీజే విలియమ్స్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న రైతుభరోసా కేంద్రంలో మంగళవారం రెండో విడత సర్పంచులు, అధికారుల శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఎంపీడీవో విలియమ్స్ సర్పంచులకు, అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రూపవతి, ఏపీఎం బాలస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

రాజుపాలెం: ప్రతి అధికారి ప్రస్తుతం నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగించుకోవాలని ఎంపీడీవో సత్యానారాయణ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్‌లో భాగంగా రెండోరోజు మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

నటనకు తొలి మెట్టు
రంగస్థలం

రంగస్థలంపై నటనకు శ్రీకారం చుట్టి సినిమాల్లో నటించి ఒక వెలుగు వెలిగిన నటీనటులు ఎందరో. స్టేజీపై డైలాగ్స్ చెబుతూ, హావభావాలు పలికిస్తూ.. ప్రేక్షకుల చప్పట్లతో మార మోగిపోతుంటే ఆ కళాకారుడు, దర్శకుడు పొందే ఆనందం మాటల్లో చెప్పలేం. అయితే, ఆ రచయితో, కళాకారుడో, దర్శకుడో తమ ప్రతిభ చాటుకోవాలంటే ఒక వేదిక కావాలి.. అవకాశమూ రావాలి. అటువంటి అవకాశాలు కల్పించేవి నాటక కళాపరిషత్‌లు, మెమోరియల్ ట్రస్టులు ఆంధ్రరాష్ట్రంలో ఎన్నో ఉన్నాయి. అటువంటివాటిలో ఒకటి పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్టు. నాటకాల ద్వారానే స్వచ్ఛమైన నటుడు బయటకు వస్తాడన్న ఆయన కుమారుడి ఆకాంక్ష మేరకు అలాంటి నటుల కోసం ఆ ట్రస్టు ద్వారా పరుచూరి వెంకటేశ్వర రావు నాటక పోటీలను నిర్వహిస్తున్నారు.


పరుచూరి రఘుబాబుకు నివాళులర్పిస్తున్న తల్లిదండ్రులైన పరుచూరి వెంకటేశ్వరరావు, విజయలక్ష్మీ, కుమారుడు రవి


పల్లెకోనలోని నందమూరి తారక రామారావు కళా భవనాన్ని ప్రారంభిస్తున్న అప్పటి మాజీమంత్రి కోడెల శివప్రసాద్



పల్లెకోనలో టి.సుబ్బరామిరెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన పరుచూరి రఘుబాబు, టి.సుబ్బరామిరెడ్డి కల్యాణమండపం

- నాటకాలకు ఊపిరిపోస్తున్న పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్టు
- కుమారుడు జ్ఞాపకార్థం పల్లెకోనలో కళాప్రాంగణం
- ముప్పై రెండేళ్లుగా కొనసాగుతున్న పోటీలు

● రేపల్లె, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సినిమా కథలు, మాటల రచయితలు, నటులు, నాటక రచయితలు పరుచూరి బ్రదర్స్ వెంకటేశ్వర రావు, గోపాలకృష్ణలు తమ రచనలతో ఎంత ప్రజాదరణపొందారో ప్రత్యేకంగ చెప్పక్కర్లేదు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పల్లెకోనలో పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్టును 1991లో ఏర్పాటు చేశారు. అఖిల భారత స్థాయిలో నాటకోత్సవాలనునిర్వహిస్తున్నారు. సమాజంలో రుగ్మతలు, దోపిడీ వ్యవస్థ, సామాజిక అంశాలను ఇతివృత్తంగా తీసుకుని రచించి ప్రజలను చైతన్యపరిచే నాటికలను ప్రోత్సహిస్తూ, నాటక రంగం అభివృద్ధి కోసం ఈ ట్రస్టు తమ వంతు పాత్ర పోషిస్తోంది.



పరుచూరి వెంకటేశ్వరరావు, భార్య విజయలక్ష్మికి ఇద్దరు కుమారులు పరుచూరి రఘుబాబు, పరుచూరి రవి, కుమార్తె పద్మావతి. రఘుబాబు గతంలో మృతి చెందారు. తన కుమారుడు గుర్తుగా పల్లెకూన లో నందమూరి తారకరామారావు కళాప్రాంగణాన్ని ఏర్పాటు చేసిన వెంకటేశ్వరరావు, ప్రతి సంవత్సరం అఖిలభారత నాటకోత్సవాలను నిర్వహిస్తున్నారు. పరుచూరి వెంకటేశ్వరరావు నాయనమ్మ గ్రామం, ఆయన భార్య విజయలక్ష్మి సొంత ఊరు పల్లె కోన. అంతేకాదు, రఘుబాబు తన చిన్నతనంలో కొంత కాలం పల్లెకూనలో పెరిగాడు. ప్రతి ఏడాది ఐదురోజుల పాటు పౌరాణిక, జానపద నాటక పోటీలు జరుగుతాయి.

దాతల సహకారం..

రేపల్లెకు పట్టణానికి చెందిన వేములపల్లి సుబ్బారావు 63 సెంట్ల స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. మరికొంతమంది 37 సెంట్ల స్థలాన్ని పరుచూరి వెంకటేశ్వరరావుకు ఉచితంగా ఇచ్చారు. దీంతో పాటు తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి సహకారంతో ఆడిటోరియం సినీనిర్మాత, రాజ్యసభ మాజీ సభ్యుడు టీ సుబ్బిరామిరెడ్డి సహకారంతో పరుచూరి రఘుబాబు, టి.సుబ్బిరామిరెడ్డి లలితకళాపరిషత్ భవనాన్ని నిర్మించారు. వీటిని మాజీ మంత్రి కోడెల శివప్రసాద్, పరుచూరి బ్రదర్స్ అప్పట్లో ప్రారంభించారు.



నాటక ప్రారంభంలో జ్యోతిప్రజల్వన కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటులు రాజేంద్ర ప్రసాద్, వెంకటేశ్వర రావు, ఎమ్మెల్యే ఆనందబాబు


అలెగ్జాండర్ నాటికలో ప్రతిభ కనబరిచిన జయప్రకాష్‌రెడ్డికి మెమెంటోను అందిస్తున్న పరుచూరి వెంకటేశ్వరరావు, ఎంఎస్‌నారాయణ (ఫైల్ ఫోటో)

కుమారుడి ఆశయం కోసం..



ట్రస్టీ పరుచూరి వెంకటేశ్వరరావు తమ కుమారుడు రఘుబాబు ఆశయం, భార్య విజయలక్ష్మి కోరిక మేరకు పల్లెకోనలో గతంలో ఆడిటోరియం నిర్మించి ప్రతియేటా నాటకోత్సవాలను నిర్వహిస్తున్నాం. వయస్సురీత్యా పెద్దవాడిని కావడం, దూరాబారం కావడంతో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నేను ఉన్నంత వరకూ కళారంగాన్ని ప్రోత్సహిస్తాను. 32 సంవత్సరాలు పాటు వందలాది నాటకాలను ప్రదర్శించి కళాకారులను ప్రోత్సహించాను. నటన లేక పోయినా హీరోలు అయ్యే పరిస్థితి ప్రస్తుతం సినీరంగంలో ఉంది.

స్నాతకోత్సాహం

(5వ పేజీ తరువాయి)..
డిగ్రీలను ప్రదానం చేశారు. ఎయిమ్స్‌మంగళగిరి సెంటర్‌ఫర్ మెడికల్‌ఎడ్యుకేషన్‌టెక్నాలజీ బ్రోచర్‌ను కేంద్రసహాయమంత్రిజాదవ్ ఆవిష్కరించారు.

47 మందిలో 17 మంది మహిళలే

ఎయిమ్స్‌లో డిగ్రీలు తీసుకున్న 47 మందిలో 17 మంది మహిళలే. దీనిపై రాష్ట్రపతి ముర్ము హర్షం వ్యక్తం చేశారు. వైద్యవృత్తిలో పెరుగుతున్న మహిళల బాగస్వామ్యంతోపాటు వారి గణనీయమైన సహకారాన్ని చూస్తూ ఉంటే అభివృద్ధి చెందుతున్న సమాజంగా మారుతున్నట్లు అనిపిస్తోందన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌కు మొదటి బ్యాచ్ విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లన్నారు. తన ప్రసంగంలో ముందుగా ఆమె మంగళగిరి క్షేత్రాన్ని గురించి ప్రస్తావించి వేదికపై నుంచే పానకాలస్వామికి నమస్కారాలను తెలిపారు. నరసింహస్వామి చెంత వైద్యవిద్యను అభ్యసించిన విద్యార్థులందరూ ఎంతో అదృష్టవంతులన్నారు. వైద్యులు సేవకు ప్రాధాన్యమివ్వాలని, యువ వైద్యులు మరింత చిత్తశుద్ధితో వ్యవహరించాలని తెలిపారు. ప్రజలు పూర్తిస్థాయి ఆరోగ్యవంతులుగా ఉండాలని.. అందుకోసం ప్రతి ఒక్కరూ తమ తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు.

దేశ భవిష్యత్ నగరంగా అమరావతి - ముఖ్యమంత్రి చంద్రబాబు

దేశ భవిష్యత్ నగరాల్లో ఏపీ రాజధాని అమరావతి ప్రముఖంగా నిలువబోతుందని సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు.దేశంలోని ఎయిమ్స్‌లన్నింటిలోనూ రాజధాని అమరావతి పరిధిలోని మంగళగిరి ఎయిమ్స్ నెంబర్‌వన్‌గా నిలుస్తుందన్న నమ్మకం తనకుందన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌లో ఎలాంటి మౌలిక సదుపాయాలకు లోటు రానివ్వబోమని హామీ ఇచ్చారు. దేశంలోని ఏ ఎయిమ్స్‌లో కూడా ఇంత సుందరమైన, ఆహ్లాదకర మైన వాతావరణం లేదన్నారు. ముర్ము సామాన్య ఆదివాసీ కుటుంబం నుంచి వచ్చి దేశ అత్యున్నత పదవిని సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. కష్టపడితే ఈ ప్రపంచంలో సాధించలేనిది ఏదీ లేదనడానికి ద్రౌపదిముర్ము జీవితమే ఒక ఉదాహరణ అని చెప్పారు. సీఎం చంద్రబాబు రాష్ట్రపతి ద్రౌపదిముర్మును శాలువతో సన్మానించి తిరుమల శ్రీవారి మెమొంటోను అందజేశారు. రాష్ట్రపతికి మంత్రి నారా లోకేశ్ మంగళగిరి చేనేత చీరెను బహూకరించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ మదబానందకర్, కలెక్టర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

సంక్రాంతికి సాధ్యమేనా?

(5వ పేజీ తరువాయి)
క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. పల్నాడు.. గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 2,153.50 కిలోమీటర్ల మేర రహదారుల్లో పనులకు రూ.113.99 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. రహదారులను ప్యాకేజీలుగా విభజించి 456 పనులు చేపడితే ఇప్పటికి 19 పనులు మాత్రమే పూర్తయినట్లు ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ప్రగతి నివేదికలు తెలియజేస్తున్నాయి. పనులు నత్త నడక కన్నా నిదానంగా సాగుతున్నాయి. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో గుంతల రహదారులతో వాహనచోదకులు ఇక్కట్లు పడుతున్నారు. సంక్రాంతి కల్లా పనులు పూర్తవుతాయని ప్రభుత్వం ప్రకటించినా పురోగతి ఆమేరకు కనిపించడంలేదు. మూడుజిల్లాల్లో కాస్తంత పల్నాడు జిల్లాలో పనులు పురోగతి కొంత మెరుగ్గా ఉంది. రహదారుల గుంతల పూడ్చివేతకు వారం వారం లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించినా ఆ మేర లక్ష్యాలను చేరుకోవడంతో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి. పనుల్లో జరుగుతున్న జాప్యంతో రహదారుల ఇక్కట్లు ఇప్పట్లో వాహనదారులకు తీరే పరిస్థితులు కానరావడం లేదు. పురోగతిని పరిశీలిస్తే ప్రభుత్వం ప్రకటించినట్లుగా సంక్రాంతికి పూర్తి అయ్యే పరిస్థితులు లేవని చెప్పవచ్చు. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో కూడా రహదారులపై గుంతల పూడ్చివేతపై చర్చ జరిగింది. వేగవంతంగా పనులు పూర్తి చేసి రహదారుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.



స్వల్ప వివాదం.. ఆగిన వివాహం

- తెలంగాణ మాజీ ఎమ్మెల్యే కూతురుతో ఓ ఐపీఎస్‌కు వావాహం నిశ్చయం
- కాంగ్రెస్ జెండాలతో ర్యాలీగా వెళ్లాలని పట్టుబట్టిన పెళ్లి కుమార్తె తరపు బంధువులు
- ససేమిరా అన్న ఐపీఎస్ వరుడు ● నిలిచిన పెళ్లి .. రంగంలోకి కాంగ్రెస్ నేతలు
- అర్థరాత్రి వరకు కొనసాగుతూనే ఉన్న చర్చలు

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్వల్ప విషయంలో తలెత్తిన వివాదంతో ఓ ఐపీఎస్ పెళ్లి కి బ్రేక్ పడింది. పెళ్లి కుమారుడు ఐపీఎస్ అధికారి కాగా పెళ్లి కుమార్తె డాక్టర్. వివరాల్లోకి వెళ్తే నగరానికి చెందిన యువకుడు గుజరాత్ క్యాడర్ ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యారు. ఆయన ప్రొఫెషనరీ పీరియడ్ పూర్తి చేసుకొని అక్కడ ఓ జిల్లాకు ఎస్పీగా ఇటీవలే నియమితులయ్యారు. ఆయనకు తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కుమార్తె అయిన డాక్టర్ తో వివాహం నిశ్చయించారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల 30 నిమిషాలకు డాన్ బాస్కోలో వివాహం జరగాల్సి ఉంది. మరి కొద్దిసేపట్లో పెళ్లి తంతు ప్రారంభం కావలసిన సమయంలో తెలంగాణ ప్రాంతం నుండి వచ్చిన పెళ్లి కుమార్తె తరపు బంధువులు పెద్ద సంఖ్యలో పట్టాభిపురం మెయిన్ రోడ్డుపై జూట్ మిల్స్ సమీపంలో ఉన్న ఐపీఎస్ అధికారి ఇంటి వద్దకు వెళ్లారు. తెలంగాణలోని తమ సంప్రదాయం ప్రకారం ఇరువురిని ఇంటి వద్ద నుంచి డాన్ బాస్కో వరకు కారులో కాంగ్రెస్ పార్టీ జెండాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లాలని పట్టుబట్టారు. ఎళ్లి కుమారుడు ఐపీఎస్ అధికారి కావడంతో అందుకు ససేమిరా అన్నారు. దీంతో ఈ విషయం మీరు వర్గాల మధ్య పంతానికి దారి తీసింది. చివరకు సున్నితమైన అంశం వివాదాస్పదంగా మారడంతో బ్రేక్ పడింది. పెళ్లి కుమార్తె తండ్రి తెలంగాణకు చెందిన మాజీ ఎమ్మెల్యేని రాక ప్రభుత్వం ఏఐసీసీలో కీలకంగా వ్యవహరిస్తుండటంతో తొలుత సంప్రదింపులు ద్వారా సమస్య పరిష్కారానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో మాజీ ఎమ్మెల్యే బంధువులు, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పెళ్లి కుమారుడు ఇంటి వద్ద పెళ్లి హడావిడి చేశారు. దీంతో పెళ్లి కుమారుడు ఐపీఎస్ అధికారులతో పోలీసులు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో పెద్ద సంఖ్యలో పోలీస్ అధికారులు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది.

ఇతంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే మస్తాన్వలి మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, సుంకర పద్మశ్రీ లతోపాటు కల్లూరు కాంగ్రెస్ నాయకులు ఐపీఎస్ అధికారి ఇంటికి వెళ్లి ఆయనతో కుటుంబ సభ్యులతో చర్చలు జరుపుతున్నారు. పీటల మీద పెళ్లి నిలిచిపోయిందని తెలియడంతో పెళ్లి కుమార్తె తల్లి గుండెపోటుతో ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. పెళ్లికి ఐపీఎస్ అధికారి కుటుంబ సభ్యులు విముఖత చూపుతుండటంతో వారిని ఒప్పించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

అర్థరాత్రి దాటిన చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి మరో వైపు పెళ్లికి మాత్రం తరుపున వచ్చిన సుమారు వందల మంది పెళ్ళి కుమారుడి బయటే మోహరించి కూర్చున్నారు. పెళ్లి కుమారుడు తరపున ఆయన బంధువైన ఫాదర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో చర్చలు జరుపుతున్నారు.

చిల్లీస్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్‌లో ఎన్నికల సందడి

- కొద్ది రోజుల్లోనే ముగియనున్న ప్రస్తుత పాలకవర్గ పదవీకాలం
- రేపు సమావేశమై చర్చించనున్న నేతలు

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ది గుంటూరు చిల్లీస్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్‌లో ఎన్నికల హడావిడి ప్రారంభమైంది. ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం జనవరి 12వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త కమిటీని ఎన్నుకొనేందుకు ఎన్నికల నిర్వహణపై కార్యచరణ ప్రణాళిక రూపొందించుకొని ఆ దిశగా ముందుకెళ్లాలని సభ్యులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం (డిసెంబరు 19వ తేదీ) 6 గంటలకు ఏటుకూరు రోడ్డులోని ఫ్యాన్సీ డిస్ట్రిబ్యూటర్స్ ప్లాజాలో సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం అసోసియేషన్ సెక్రెటరీ డీ నరేంద్రబాబు సభ్యులకు సమాచారం అందించారు. ఎన్నికలతో పాటు గత రెండేళ్లలో జరిగిన ఆర్థిక లావాదేవీల సమాచారాన్ని సభ్యుల ముందుంచుతామన్నారు. అలానే కమీషన్ ఏజెంట్‌లు మిర్చియార్డులో ఎదుర్కొంటున్న ఇతరత్రా సమస్యల పైనా చర్చించనున్నారు.

అబాకస్‌లో మువ్వా వేదాన్ష్ ప్రతిభ

- 8 నిమిషాల్లో 200 సమస్యలను పరిష్కరించి అంతర్జాతీయ ఛాంపియన్ షిప్ కైవసం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): యూనివర్సల్ కాన్సెప్ట్ మెంటల్ అర్థమెటిక్ సిస్టమ్(ఈసీఎమ్ఎఎస్) ఆధ్వర్యంలో ఢీల్లీలో ఈ నెల 14,15 తేదిల్లో జరిగిన అంతర్జాతీయ అబాకస్, మెంటల్ అర్థమెటిక్ పోటీల్లో నగరంలోని తారకరామ్‌నగర్‌కు చెందిన మువ్వా వేదాన్ష్ సత్తా చాటాడు. కేవలం 8 నిమిషాలలో 200 సమస్యలను పరిష్కరించి ఓవరాల్ అంతర్జాతీయ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నాడు. ఈపోటీలకు 30 దేశాలు, పలు రాష్ట్రాలను చెందిన దాదాపు 6వేల మంది విద్యార్థులు హాజరైయ్యారు. ఈ పోటీలలో మువ్వా వేదాన్ష్ పాల్గొని ఈ ఘనతను సాధించారు. ఇప్పటికే అబాకస్ లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా అంతర్జాతీయ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్న మువ్వా వేదాన్ష్‌ను పలువురు అభినందించారు.


ఓవరాల్ అంతర్జాతీయ ఛాంపియన్‌షిప్ ట్రోఫితో మువ్వా వేదాన్ష్

పరీక్షా కాలమ్




నిశిత పరిశీల.. విశ్లేషణ సాధనతో
గణితంలో మెరుగైన మార్కులు

'పదో తరగతి పరీక్షల్లో అత్యంత కీలకమైన సబ్జెక్టు గణితం. సాదాసీదా విద్యార్థులు సైతం కొద్దిగా కష్టపడితే అత్యధిక మార్కులు తెచ్చుకుని స్కోరు పెంచుకునే అవకాశం ఉంది. దానికోసం నిశిత పరిశీలన, విశ్లేషణాత్మక సాధన అవసరం' అని గుంటూరు లోని చౌత్రా సెంటరులో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల గణితశాస్త్ర ఉపాధ్యాయుడు ఆట్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. 'పరీక్షా కాలమ్'లో గణితంలో సాధన గురించి పదో తరగతి విద్యార్థులకు ఆయన చెవుతున్న పలు సూచనలు..

గుంటూరు (విద్య), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పరీక్షలు ప్రారంభం అయ్యే వరకు ప్రతి రోజు లెక్కల్ని విభాగాల వారీగా సాధనం చేయడం ఫార్ములాలు మననం చేసుకోవడం వంటి జాగ్రత్తలతో మెరుగైన మార్కులు సాధించేందుకు అవకాశం ఉంది. పటిష్టమైన సాధనతో గణితంలో నూటికి 95 పైగా ఒక్కోసారి నూటికి నూరు మార్కులు సాధించే అవకాశం ఒక్క గణితం సబ్జెక్టులోనే సాధ్యం అనే విషయం విద్యార్థులు విస్మరించకూడదు. అయితే దీనికి నిరంతర సాధన ఎంతో అవసరం. ఒకటికి మూడు సార్లు లెక్కల్ని సాధన చేయాల్సి ఉంటుంది. గణితంలో సెమ్ 1లో ఏడు పాఠ్యాంశాలు,సెమ్-2లో మరో ఏడు పాఠ్యాంశాలు చొప్పున మొత్తం 14 పాఠ్యాంశాలు ఉంటాయి.

- తొలుత రియల్ నెంబర్స్‌లో ప్రధానంగా హెచ్‌సిఎఫ్, ఎల్‌సియంరూట్‌నంబర్స్ సంబంధించిన ప్రశ్నలు వస్తాయి. ఇందులో ఒన్‌మార్కు, 8 మార్కుల ప్రశ్నలు ఉంటాయి.
- తరువాత పెయిర్ ఆఫ్ లీనియర్‌లో ఇక్వెషన్స్‌లో గ్రాఫ్‌కు సంబంధించిన ప్రశ్నలు వస్తాయి. సరళరేఖల జతలకు సంబంధించిన నిష్పతుల పోలిక, బీజగణతం వివరణకు సంబంధించిన ప్రశ్నలు వస్తాయి ఇవి ఎనిమిది మార్కులకు ఇస్తారు.
- కోఆర్డినేట్ జామెట్రిలో ప్రధానంగా డిస్టెన్స్ ఫార్ములా, సెక్షన్ ఫార్ములా మీద ప్రశ్నలు వస్తాయి. ఇవి నాలుగు మార్కులకు వస్తాయి.
- అర్థమెకటిక్ ప్రొగ్రెసెన్స్ ఇందులో ఎపి అర్థమెటిక్ ప్రొగ్రెసెన్, ఎన్త్ ఎన్ వ పదం, ఎన్‌వ పదాల మొత్తం వంటి వాటి మీద ప్రశ్నలు వస్తాయి.
- సెమిస్టర్-2లో ప్రొబలిటి పాఠంలో కార్డ్స్‌లెక్కలు డైస్‌మీద,కాయిన్స్ మీద ఉన్నటువంటి లెక్కలు 13 మార్కులకు వస్తాయి.
- స్టాటిస్టిక్స్‌లో మీన్,మీడియన్,మోడ్ మీదున్న సమస్యలు, ఫార్ములా వివరణ మీద 12 మార్కులకు ప్రశ్నలు వస్తాయి.
- ఇంటర్‌డక్షన్ ఆఫ్ ట్రిగనామెట్రీ, అప్లికేషన్ ఆఫ్ ట్రిగనామెట్రీలో విభావంలో 8 మార్కుల ప్రశ్నలు వస్తాయి. ఇందులో బొమ్మవేయడం, పార్టులు రాయడం, తరువాత సమస్య పరిష్కారం చేయాలి.
- పరీక్ష సమయంలో ముందుగా ప్రశ్నాపత్రాన్ని బాగా చదువుకోవాలి. పూర్తిగా అర్థం చేసుకున్న తరువాతే రాయడం ప్రారంభించాలి.
- గణితం పరీక్షలో ముందుగా బాగా వచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయాలి, రాని ప్రశ్నలు మరోసారి పరిశీలించి రాయాలి. కనీసం ఫార్ములా వేసినా లేదా లెక్కను గుర్తున్న వరకు చేసిన మార్కులు వస్తాయి.
- ఇప్పుడు ఉన్న సమయంలో ప్రతిరోజు విభాగాల వారీగా లెక్కల్ని సాధన చేయాలి. ఫార్ములాలు గుర్తుంచుకోవాలి. పరీక్షల అప్పుడే పరీక్షల సమయంలో మంచి మార్కులు సాధించడానికి అవకాశం ఉంటుంది.


ఆట్ల శ్రీనివాసరెడ్డి, గణిత ఉపాధ్యాయుడు, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల గుంటూరు.

త్రికోటేశ్వరునికి మహా రుద్రాభిషేకం

- జ్యోతి దర్శనంతో పులకించిన భక్తులు

కోటప్పకొండ (నరసరావుపేట), డిసెంబరు 17 : ఆరుద్రోత్సవం సందర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామికి మహారుద్రాభిషేకాలు సోమవారం అర్థరాత్రి నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు నేత్ర పర్వంగా జరిగాయి. సుగంధ ద్రవ్యాలతో స్వామిని అభిషేకించారు. ఆవు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, విభూది, గంధం, కుంకుమ, తైలం, సుగంధ ద్రవ్యాలు, ఫలాలతో వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. స్వామికి అన్నాభిషేకం వైభవంగా జరిగింది. అర్థరాత్రి పాత కోటేశ్వర స్వామి దేవాలయం వద్ద కర్పూర జ్యోతి దర్శనం చేసుకొని భక్తులు పులకించి పోయారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అభిషేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయంలో ఏర్పాట్లను ఈవో డీ చంద్రశేఖరరావు పర్యవేక్షించారు.


శ్రీ త్రికోటేశ్వర స్వామికి అన్నాభిషేకం


పాలు, గంధం, చెక్కర, ఎండు ఫలాలతో స్వామి వారికి అభిషేకాలు

గణపవరంలో ఆక్రమణల తొలగింపు

నాదెండ్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలోని పోలేరమ్మ గుడి సెంటరులో ఆక్రమణలను పంచాయతీ వారు తొలగించారు. కావూరు - లింగంగుంట్ల మార్గంలో పలువురు కాలువలపై, రోడ్డు పక్కన బడ్డీ దుకాణాలను ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల క్రితం ఆ ప్రాంతాన్ని పరిశీలించిన ఆర్డీవో మధులత పాఠశాల ముందు ఉన్న ఆక్రమణలు తొలగించాలని అధికారులకు సూచించారు. దీంతో మంగళవారం ఉదయం కార్యదర్శి మారుతీ బాబు ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగించారు.

భర్త దాడిలో భార్య మృతి

చిలకలూరిపేట డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య జరిగిన వివాదంలో భర్తచేసిన దాడిలో భార్య మృతి చెందిన సంఘటన చిలకలూరిపేట మండలం వేలూరులో జరిగింది. రూరల్ ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వేలూరుకు చెందిన కందిమళ్ళ సాంబయ్య, రజిని భార్యాభర్తలు. సోమవారం వారిమధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. భర్త సాంబయ్య కూరగాయలు చాకుతో భార్య రజినిని గాయపరిచాడు. గాయపడ్డ ఆమె కొద్దిసేపటికి మృతి చెందింది. వారి కుమారుడు సురేష్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

మిర్చియార్డు పూర్వ సెక్రెటరి ఐవీ రెడ్డికి పోస్టింగ్

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు పూర్వ సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరి ఐ వెంకటేశ్వరరెడ్డికి ప్రభుత్వం పోస్టింగ్ కల్పించింది. గత రెండు నెలల నుంచి ఆయన పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. మంగళవారం ఐవీ రెడ్డికి నెల్లూరు ఏఎంసీలో పోస్టింగ్ ఇచ్చింది. మరోవైపు రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీకి సెక్రెటరీగా ఉంటూ నరసరావుపేట ఏఎంసీకి ఆన్ డ్యూటీ సెక్రెటరీగా ఉన్న గుంటూరు యార్డు కార్యదర్శి వినుకొండ అంజనేయులుకు ప్రత్యామ్నాయంగా నరసరావుపేట, రాజమహేంద్రవరంలలో వేరొకరికి పోస్టింగ్‌లు కల్పించాలని డైరెక్టర్‌ని ఆదేశించింది.

వల్లభేశ్వర స్వామికి ఆరుద్రోత్సవం



రొంపిచర్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పర్లలోని వల్లభేశ్వర స్వామికి ఆరుద్రోత్సవం సందర్భంగా వివిధ సుగంధ ద్రవ్యాలతో మంగళవారం అర్ధరాత్రి అభిషేకాలు నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, పంచదార, పసుపు, కుంకుమ, గంధం, విభూది వంటి దవ్యాలతో అభిషేకాలను నిర్వహించారు. అన్నాభిషేకం జరిగింది. 12కిలోల కర్పూరంతో హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం రాత్రి జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి, పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు.

● శావల్యాపురం: దేశవ్యాప్తంగా జరుగుతున్న 21వ పశుగణన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రైతులు సహకరించాలని శావల్యాపురం పశువైద్యాధికారి డాక్టర్ సోమల గుణధీర్ కోరారు. శావల్యాపురంలో పశుగణన కార్యక్రమాన్ని ఆయన మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

● ఈపూరు: సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటర్‌కమిటీ అధ్యక్షుడిగా కొండ్రముట్ల-1 సాగునీటి సంఘం అధ్యక్షుడు గడిపూడి వేణుగోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వేణుగోపాల్‌ను టీడీపీ జిల్లా అధికారప్రతినిధి రాపర్ల జగ్గారావు, నియోజకవర్గం నాయకులు, సాగునీటి సంఘాల అధ్యక్షులు మంగళవారం ఘనంగా సన్మానించారు.

● నూజెండ్ల: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ప్రత్యేక చొరవ చూపాలని ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి శిక్షణ కార్యక్రమం చివరి రోజు శిక్షణలో ఆయన పాల్గొన్నారు. జడ్పీటీసీ జెడ్డా సుబ్బులు, ఎంపీడీవో ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: మండలంలోని కొప్పుకొండ, కొప్పుకొండ తండాలో మండల వ్యవసాయాధికారి అంజిరెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యానవన సహాయకులు నారాయణ, తండా సర్పంచ్ బూక్యా మంత్రునాయక్, రైతులు పాల్గొన్నారు.

● నూజెండ్ల: మండలంలోని వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు మంగళవారం, పాత చెరుకుంపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో సుగుణా బేగం, ఏఈవో ఎలిషా, గ్రామ వ్యవసాయ సహాయకులు జీ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: చిలకలూరిపేట నియోజకవర్గం పరిధిలో ఉన్న సాగర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ) నెంబరు 20, 21 లకు మంగళవారం స్థానిక ఎన్ఎస్‌పీ కెనాల్స్ కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. డీసీ20కు అధ్యక్షుడిగా జాగర్లమూడి హనుమంతరావు, ఉపాధ్యక్షుడిగా మాలెంపాటి నాగేశ్వరరావులు ఎన్నికయ్యారు. డీసీ 21కి అధ్యక్షుడిగా నెల్లూరి రామారావు, ఉపాధ్యక్షుడిగా మత్తుకూరి కృష్ణమూర్తి ఎన్నికయ్యారు.

● చిలకలూరిపేట: స్థానిక రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట వారి ఆధ్వర్యంలో మంగళవారం రోటరీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో 13మంది నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు.

● చిలకలూరిపేట: పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలో ఉన్న 20 మంది 75 సంవత్సరాలు దాటిన పెన్షనర్లను పట్టణంలోని పెన్షనర్ల హాల్‌లో మంగళవారం ఘనంగా సత్కరించారు. నాదెండ్ల మండలంలోని గణపవరంలో మంగళవారం జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

● రొంపిచర్ల: డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షుడిగా 23 సంతగుడిపాడు అధ్యక్షుడు మాచవరంనకు చెందిన యాంపాటి కోటిరెడ్డి, 24 రొంపిచర్ల డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా గోగులపాడుకు చెందిన జవ్వాజి నరసింహయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 24 ఉపాధ్యక్షుడిగా రొంపిచర్లకు చెందిన మాదినీడి అంజయ్యలను ఎన్నుకున్నారు.

ప్రభుత్వంపై నమ్మకానికి నిదర్శనం డీసీ ఎన్నికలు

చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



నూతనంగా ఎంపికైన డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్షులను ఘనంగా సన్మానిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుతం వెలువడిన సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నిక ఫలితాలు కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో, ముఖ్యంగా రైతుల్లో ఉన్న నమ్మకానికి నిదర్శనమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. నూతనంగా ఎంపికైన డీసీ అధ్యక్షులను టీడీపీ కార్యాలయంలో జీవీ ఆంజనేయులు దుశ్శాలువాలతో మంగళవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సాగునీటి సంఘాలు కూటమి ఖాతాల్లోకి వచ్చాయని, ఇదే ఏకగ్రీవ స్ఫూర్తితో భవిష్యత్‌లో జరిగే అన్ని ఎన్నికల్లో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే సాగునీటి రంగం వ్యవసాయానికి తీసుకుంటున్న చర్యలు రైతుల్లో కల్గిస్తున్న నమ్మకంతోనే ఇలాంటి ఏకపక్ష ఫలితాలు సాధించగలిగామన్నారు. కార్యక్రమంలో కాకాని వీరాంజనేయులు, మీసాల మురళీకృష్ణయాదవ్, డీఎల్‌డీఏ ఛైర్మన్ లగడపాటి వెంకటరావు, ముంద్రు సుబ్బారావు, వంకాయలపాటి పేరయ్య, నక్కా వీరారెడ్డి, పెమ్మసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీసీ అధ్యక్షుల ఎంపిక ఏకగ్రీవం

వినుకొండ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 14వ తేదీన జరిగిన సాగునీటి సంఘం ఎన్నికల్లో గెలుపొందిన సాగునీటి సంఘం అధ్యక్షుల నుంచి స్థానిక ఎన్ఎస్‌పీ కాలనీ గ్రౌండ్‌లో మంగళవారం డీసీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చీకటీగలపాలెం డీసీ అధ్యక్షుడిగా ముత్తినేని ఏడుకొండలు, ఉపాధ్యక్షుడిగా కామిశెట్టి ఏడుకొండలు, ములకలూరు డీసీ అధ్యక్షుడిగా నక్కా బుల్లీశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడిగా గోరంట్ల సాంబయ్య, ఐనవోలు డీసీ అధ్యక్షుడిగా రావుల బుజ్జి, ఉపాధ్యక్షుడిగా ఫణిదపు గాలేశ్వరరావు, త్రిపురాపురం డీసీ అధ్యక్షుడిగా గంగినేని రాఘవ, ఉపాధ్యక్షుడిగా మేదరమెట్ల శ్రీనివాసరావు, వినుకొండ-1 డీసీ సంఘం అధ్యక్షుడిగా గడిపూడి వేణుగోపాలరావు, ఉపాధ్యక్షుడిగా మాలపాటి వెంకటసుబ్బారెడ్డిలను సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతరం నూతనంగా ఎంపికైన డీసీలకు ఎన్నికల అధికారులు కుమార్‌రాజ్, నారాయణస్వామి, టి.వెంకటరమణ, నారాయణ, శ్రీదేవిలు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం నూతనంగా ఎంపికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు వారి బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని దుశ్శాలువాలతో సన్మానించారు.

గంటవారిపాలెం డీసీ అధ్యక్షుడిగా వెంకటనారాయణ

శావల్యాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గంటవారిపాలెం సెక్టార్ పరిధిలోని సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూషన్ కమిటీ- 25 అధ్యక్షుడిగా శావల్యాపురం మండలం శానంపూడి-1 సాగునీటి సంఘం (206) అధ్యక్షుడు మందలపు వెంకట నారాయణను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. నరసరావుపేటలోని ఎన్నెస్పీ కార్యాలయంలో గంటవారిపాలెం సెక్టార్ డిస్ట్రిబ్యూషన్ కమిటీ-25 అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలను మంగళవారం నిర్వహించారు. ఎన్నెస్పీ డీఈ విజయలక్ష్మి మాట్లాడుతూ డీసీ పరిధిలోని 11 సాగునీటి సంఘాల అధ్యక్షులంతా కలసి అధ్యక్షుడిగా వెంకటనారాయణను, ఉపాధ్యక్షుడిగా ఏనుగుపాలెం-2 సాగునీటి సంఘం (214) అధ్యక్షుడు మక్కెన ఏడుకొండలును ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన డీసీ అధ్యక్షుడు వెంకటనారాయణకు, ఉపాధ్యక్షుడు ఏడుకొండలుకు ఎన్నెస్పీ డీఈ విజయలక్ష్మి, ఏఈ లక్ష్మీనారాయణ నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కూటమి నాయకులు, సాగునీటి సంఘాల అధ్యక్షులు కలసి అధ్యక్ష, ఉపాధ్యక్షులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కూటమి నేతలు గడిపూడి విశ్వనాథం, యరమాసు కోటేశ్వరరావు, గోరింట్ల హనుమంతరావు, కోటా హరిబాబు, చింతా గంగయ్య, పూరేటి వెంకట్రావు, మాదినేని మధు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి రక్షణ కవచం పింఛను

చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



పెన్షనర్ల డే సందర్భంగా 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జీవి, మక్కెన

వినుకొండ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని విశ్రాంతి ఉద్యోగుల సేవా సంఘం భవనంలో ఆల్‌ఇండియా పెన్షనర్ల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొని ఆల్‌ఇండియా పెన్షనర్ల ఆరాధ్యుడు డీఎస్ నకరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ జీవీ మాట్లాడుతూ పట్టణంలో పెన్షనర్ల సేవా సంఘం చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్ల దంపతులను దుశ్శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు భువనగిరి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి కాళ్ల కృష్ణమూర్తి, రాఘవయ్య, కృష్ణారెడ్డి, గురవయ్య, సుబ్బయ్యశర్మ, సుబ్బారావు, టీడీపీ నాయకులు పీవీ సురేష్, సీహెచ్ జాన్‌సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్

వినుకొండ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సాటివారికి ఆనందాలను పంచి పెట్టడంలో ఉన్న సంతృప్తి మరెక్కడ రాదని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని వెల్లటూరురోడ్డులోని ఎంపీసీ ఫంక్షన్ హాల్‌లో రూరల్ పాస్టర్స్ ఫెలోషిప్ సమైఖ్య ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ ఏర్పాటులో క్రైస్తవులు ముఖ్యపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సు వద్ద ఆర్డీవో మధులతతో మాట్లాడుతున్న కలెక్టర్

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

● పెదరెడ్డిపాలెం సదస్సులో కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట కల్చరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమస్యల తక్షణ పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. మండలంలోని పెదరెడ్డిపాలెంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సును ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం కలెక్టర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు చేశారు. పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం పంపిణీపై కలెక్టర్ ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత, తహసీల్దారు వేణుగోపాలరావు, ఐసీడీఎస్ సిబ్బంది ఉన్నారు.

● పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. 2024-25 రబీ సీజన్ బీమాపై మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, ఎల్‌డీఎం రామప్రసాద్, డీఈఎస్‌వో జి.శ్రీనివాస్, డీహెచ్‌వో సిహెచ్.వి.రమణారెడ్డి, ఎన్ఎస్పీ ఏఈ ఎస్.మణిదీప్, ఇన్సూరెన్స్ ప్రతినిధి ఎస్.బి.పంత్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

● డీఆర్‌వో మురళి

నాదెండ్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా రెవెన్యూ అధికారి ఈ మురళీ అన్నారు. మండలంలోని తూబాడు గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్న వారికి ఉచితంగా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా 16 అర్జీలు పట్టాదారు పాసు పుస్తకాలకు, మరో 16 అర్జీలు ఇతర సమస్యలకు సంబంధించి అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రమణ, డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మి, సర్వేయర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

● నూజెండ్ల : ఇనామ్ భూములపై పూర్తి స్థాయి హక్కులు కల్పించాలని కొండ్రప్రోలు రెవెన్యూ గ్రామంలోని భూములు గల రైతులు తహసీల్దార్ జీ రమేష్ కుమార్‌కు మంగళవారం రెవెన్యూ గ్రామ సభలో వినతి పత్రం అందజేశారు.

● కొత్తలూరు (శావల్యాపురం): మండలంలోని కొత్తలూరు సచివాలయంలో రెవెన్యూ గ్రామసభను మంగళవారం నిర్వహించారు. గ్రామసభలో 29మంది రైతులు వివిధ రకాల భూసమస్యలపై తహసీల్దార్ సుజాతకు దరఖాస్తులు అందజేశారు. రీసర్వే డీటీ నాసరయ్య, సర్వేయర్ రాజు, సీనియర్ అసిస్టెంట్ చంద్రబాబు, వీఆర్వో మంగయ్య, విలేజ్ సర్వేయర్ గురుబ్రహ్మం పాల్గొన్నారు.

● ఈపూరు: మండలంలోని ముప్పాళ్ళలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు ఏ నళినికి భూ సమస్యలపై 20 అర్జీలను గ్రామస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు నబీ, నాగరాజు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, గోపువారిపాలెం సర్పంచ్ గోనుగుంట్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: మండలంలోని ఏనుగుపాలెం గ్రామంలో డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంలోని రైతులు పెద్ద సంఖ్యలో ఏళ్ళ తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేశారు. సమస్యలపై తహసీల్దార్ సురేష్ వెంటనే సిబ్బంది సాయంతో పరిష్కరించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీహరి, వీఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రామాలయంలో ధనుర్మాస పూజలు



స్వామివారి కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

వినుకొండ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్‌లోని రామాలయంలో ధనుర్మాస పూజా కార్యక్రమాలు భక్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి గోవిందనామాలు స్మరిస్తూ పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం దేవాలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తెగుళ్ళ నివారణతోనే పంటలకు అధిక దిగుబడులు: ఇన్‌చార్జి ఏఎంవో

శావల్యాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పంటలకు ఆశించిన తెగుళ్ళను సకాలంలో నివారించినపుడే రైతులు అధిక దిగుబడులు సాధించగలుగుతారని ఇన్‌చార్జి ఎంఏవో రామినేని రామారావు అన్నారు. శావల్యాపురం, కనమర్లపూడి గ్రామాల్లో రైతులు సాగుచేసిన కంది, మిరప, మొక్కజొన్న, వరి తదితర పంటలను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. పీఎం కిసాన్, ఈకేవైపీ పెండింగ్ ఉంటే వెంటనే చేయించుకోవాలని, బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింక్ చేయించుకోవాలని, లేకపోతే పోస్టల్ అకౌంట్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో పూరేటి అశోక, వీఏఏలు స్రవంతి, వెంకాయమ్మ పాల్గొన్నారు.

మిర్చి ధరల పతనంతో దిక్కుతోచని స్థితిలో రైతులు

● ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలరావు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్చి ధరల పతనంతో ఆరుగాలం సాగుచేసి పండించిన రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన పెట్టుబడులు, చీడపీడల బెడదలు, అన్నింటిని ఎదుర్కొని పంట పండించిన రైతుకు అమ్ముకునే దశకు వచ్చేసరికి అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి అనే విధంగా తయారైందన్నారు. మిర్చి యార్డులో ఎగుమతి దారులు, కమీషన్ వ్యాపారులు కూడాబలుక్కొని ధర పెరగకుండా చూస్తున్నారని ఆరోపించారు. ఈ సమయంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని ఆ మాయాజాలాన్ని అరికట్టి రైతులకు అండగా నిలవాలన్నారు.

పోలీసులమంటూ రూ.3లక్షలకు టోకరా

వినుకొండ టౌన్, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): పోలీసులమని చెప్పి సుబాబుల కొనుగోలుదారుల నుంచి 3లక్షల రూపాయలు దోచుకున్న సంఘటన పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుడు వెంకటనర్సయ్య తెలిపిన వివరాలు మేరకు ఖమ్మం జిల్లా మధిర గ్రామానికి చెందిన వెంకటనర్సయ్య గత కొన్ని సంవత్సరాలుగా వినుకొండ పరిసర ప్రాంతాల్లో సుబాబులు కొనుగోలు చేస్తుంటాడు. సుబాబుల తోటలు చూపిస్తామంటూ నమ్మబలికి ఒక లాడ్జిలో నుంచి ఏనుగుపాలెం రోడ్డులోని కాశినాయన ఆశ్రమం వద్దకు తీసుకువెళ్ళి పోలీసులమనిచెప్పి వారి వద్ద నుంచి రూ.3లక్షల వరకు తీసుకొని పరారయ్యారు. జరిగిన సంఘటనపై వినుకొండ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో భూమి ఉత్పాదక శక్తి పెరుగుతుంది: అమలకుమారి

నరసరావుపేట టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భూమి ఉత్పాదక శక్తి పెంచే శక్తి ప్రకృతి వ్యవసాయానికి ఉందని రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే అమల కుమారి అన్నారు. మంగళవారం నరసరావుపేటలోని అంజిరెడ్డి మీటింగ్ హాల్‌లో వినుకొండ డివిజన్, బెల్లంకొండ మండలంలోని సిబ్బందికి ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కే అమల కుమారి మాట్లాడుతూ ప్రతి రైతు మొత్తం వ్యవసాయ క్షేత్రంలో 30 రకాల విత్తనాలు వేయడం వల్ల రసాయన వ్యవసాయంలో కోల్పోయిన కర్బన శాతాన్ని తిరిగి భూమికి అందించవచ్చునని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

తెగుళ్లపై రైతులకు అవగాహన

బొల్లాపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాటి తండాలో మంగళవారం వినుకొండ ఉద్యాన శాఖ అధికారి షేక్ నబీ రసుల్లా, సీనియర్ సైంటిస్టు ఉద్యాన పరిశోధన కేంద్ర ఎం రవీంద్రబాబు మిర్చి పంటలను పరిశీలించి రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సైంటిస్టు ఉద్యాన పరిశోధన కేంద్ర ఎం.రవీంద్రబాబు మాట్లాడుతూ రైతులు పంటలపై వచ్చే వేరు కుళ్ళు తెగులు, దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పంట మొదళ్ళల్లో బాగా తడిపినట్లయితే మొక్కలను కాపాడుకోవచ్చన్నారు. కాయ కుళ్ళు కొమ్మ ఎండు తెగుళ్ళ నివారణ కొరకు నాటో 50 శాతం పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హనుమా నాయక్, షేక్ హుస్సేన్, రవి నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పూడిక తీశారు.. తొలగింపు మరిచారు

● పల్నాడు రోడ్డులో ట్రాఫిక్ ఇక్కట్లు



పల్నాడు రోడ్డులో వరద నీటి కాలువలో తీసిన పూడిక మట్టి

పల్నాడు రోడ్డులోని వరద నీటి కాలువలో పురపాలక సంఘం పూడిక తీసి, మట్టిని ప్రధాన రహదారిపై పడవేశారు. పది రోజులు గడుస్తున్నా రహదారిపై వేసిన పూడిక మట్టిని తొలగించలేదు. దీంతో పల్నాడు రోడ్డులో వాహనదారులు తీవ్ర ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నారు. మునిసిపాల్టీ అధికారుల నిర్లక్ష్యం వాహనదారులకు శాపంగా మారింది. పూడిక మట్టిని ఎప్పటికి తొలగిస్తారంటూ పలువురు వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. మునిసిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది నిర్లక్ష్యం వీడి రహదారిపై మట్టిని తొలగించి ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. - **నరసరావుపేట, ఆంధ్రజ్యోతి**

నకరికల్లు-చీరాల ఓడరేవు రహదారి ఎలైన్‌మెంట్ మార్చుచేయాలి

● మంత్రి నారా లోకేశ్‌కు పలువురు రైతుల విజ్ఞప్తి



మంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, రైతులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నకరికల్లు- చీరాల ఓడరేవు 167ఎ హైవే ఎలైన్‌మెంట్ మార్చుచేయాలని బాధిత రైతులు కోరారు. మంగళవారం అమరావతిలో మంత్రి నారా లోకేశ్‌ను రైతులు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నకరికల్లు - చీరాల ఓడరేవు వరకు 167ఎ నాలుగు లైన్ల రహదారిని ఎన్‌హెచ్ఐ అధికారులు 2022లో ప్రతిపాదించారన్నారు. ఇందులో అంతర్భాగంగా నరసరావుపేట బైపాస్ నిర్మాణానికి మూడు ఆప్షన్లు ఇచ్చారన్నారు. ఇందులో నరసరావుపేటకు దక్షిణం వైపు బైపాస్‌కు ప్రతిపాదించిన ఆప్షన్-3 వల్ల ఐదు గ్రామాల ప్రజలు పెద్దఎత్తున నష్టపోవాల్సి వస్తుందన్నారు. రైతులకు నష్టం తక్కువ నష్టం కలిగించే ఆప్షన్-2 అమలు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండారుపల్లి విశ్వేశ్వరరావు, పులుకూరి జగ్గయ్య, పులిమి వెంకటరామిరెడ్డి, బొడ్డపాటి పేరయ్య, మక్కెన ఆంజనేయులు, అబ్బూరి శ్రీనివాసరావు, పీటర్ రాజు, కన్యదార రాజు, జాగర్లమూడి హనుమంతురావు, వసంత యలమంద తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయండి

● పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మోహనరావు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో 2025 జనవరి 5, 6, 7, 8 తేదీలలో జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం మోహనరావు కోరారు. మంగళవారం నరసరావుపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సభల ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎం మోహనరావు మాట్లాడుతూ యూటీఎఫ్ స్థాపించి 50 ఏళ్ళు పూర్తయిన నేపథ్యంలో కాకినాడలోని పీఆర్ డిగ్రీ కళాశాలలో స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి: ఎంపీపీ ఝాన్సీ

యడ్లపాడు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఝాన్సీ కోరారు. యడ్లపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఝాన్సీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముందుగా అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీడీవో హేమలతాదేవి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం మెరుగ్గా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయశ్రీ, ఎంపీటీసీ సభ్యుడు అరుణ్, మరో ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి పలు సమస్యలను సభ దృష్టికి తెచారు. కార్యక్రమంలో వంకాయలపాడు పంచాయతీ కార్యదర్శి బాపిరాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

విఠంరాజుపల్లిలో షర్మిల జన్మదిన వేడుకలు

వినుకొండ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠంరాజుపల్లి సమీపంలోని బధిరుల పాఠశాల్లో వినుకొండ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి బోయపాటి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల పుట్టినరోజు వేడుకలు మంగళవారం నిర్వహించారు. కేక్ కట్‌చేసి పిల్లలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.పూర్ణచంద్రరావు, నాగూర్‌బాషా, ఎ.శ్రీను, దేవ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.